ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వెల రూ.5/ - పేజీలు : 8 ఆదివారం 27 జూలై 2025 సంపుటి: 01, సంచిక : 82
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news

## సరికొత్త విజన్‌తో ముందుకొచ్చిన ఎన్ఐఏటీ

ఇండియాలో ప్రతి సంవత్సరం లక్షల మంది విద్యార్థులు గ్రాడ్యుయేట్స్ అవుతున్నారు. 2024 ఆర్థిక సర్వేలో కేవలం 51 శాతం గ్రాడ్యుయేట్స్‌కి మాత్రమే ఉద్యోగావకాశాలు వచ్చినట్లు తేలింది. అందుకే ఇప్పుడు ఇండియాలో చాలా యూనివర్సిటీలు ఒక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఇండియాలో ప్రతి సంవత్సరం లక్షల మంది విద్యార్థులు గ్రాడ్యుయేట్స్ అవుతున్నారు. 2024 ఆర్థిక సర్వేలో కేవలం 51 శాతం గ్రాడ్యుయేట్స్‌కి మాత్రమే ఉద్యోగావకాశాలు వచ్చినట్లు తేలింది. అందుకే ఇప్పుడు ఇండియాలో చాలా యూనివర్సిటీలు ఒక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నాయి.

# అన్నీ స్విగ్గీ పాలిటిక్సే!



- తమకు కావాల్సింది ఎక్కడ దొరుకుతుందనే చూస్తున్నారు
- సిద్ధాంతాల కోసం పాటుపడే నేతలు తగ్గిపోయారు
- మేనేజ్‌మెంట్ రాజకీయాలే నడుస్తున్నాయి
- ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి ప్రమాదకరం
- కార్యకర్తలు పోయి వలంటీర్ల వ్యవస్థ వస్తోంది
- ప్రస్తుత రాజకీయాలపై సీఎం రేవంత్ వ్యాఖ్యలు
- జైపాల్‌రెడ్డి పురస్కారాల ప్రదానోత్సవంలో ప్రసంగం
- పీవీ తర్వాత అంత గొప్ప రాజకీయాలు జైపాల్‌వే
- తెలంగాణ ఏర్పాటులో ఆయన పాత్ర కీలకమని వెల్లడి

**సూర్య హైదరాబాద్/షాద్‌నగర్**

ఒకప్పటి ఆదర్శవంతమైన రాజకీయాలు పోయి ఇప్పుడంతా స్విగ్గీ పాలిటిక్స్ వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తమకు కావాల్సినది ఎక్కడ దొరుకుతుంది, ఎక్కడ త్వరగా డెలివరీ చేస్తారని చూస్తున్నారే తప్ప సిద్ధాంతాల కోసం పాటుపడేవారు తగ్గిపోయారని పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో ప్రజాస్వామిక విలువలు తగ్గిపోయాయని... మేనేజ్‌మెంట్ రాజకీయాలే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఈ తీరు ప్రజాస్వామ్య స్ఫూర్తికి అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం రాజకీయాల్లో కార్యకర్తలు పోయి వలంటీర్ వ్యవస్థ వస్తోందని... కార్యకర్తలు లేని రాజకీయాలు దేశ భవిష్యత్‌కు ప్రమాదకరమని చెప్పారు. సిద్ధాంతపరమైన రాజకీయాలను ప్రోత్సహించాల్సిన - మిగతా 2లో

3



## మేకిన్ ఇండియా అస్త్రాల సత్తా చాటాం

- ఆపరేషన్ సిందూర్‌లో శత్రువులను మట్టికరిపించాం
- స్వదేశీ ఆయుధాల బలాన్ని ప్రపంచానికి చూపాం
- భారత్–యూకే వాణిజ్య ఒప్పందం చరిత్రాత్మకం
- మన దేశంపై పెరుగుతున్న నమ్మకానికి సూచిక
- కాశీ–తమిళ సంగమంతో సాంస్కృతిక వారసత్వం బలోపేతం
- ఆత్మవిశ్వాసంతో వికసిత్ భారత్ నిర్మిస్తున్నాం
- తమిళనాడులోని తూత్తుకుడిలో ప్రధాని మోదీ
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

3



## సైనికులకు న్యాయ సేవ

- 'దేశానికి రక్షణ కల్పించండి..
- మీ సమస్యలతో మేం పోరాడుతాం'
- నల్సా ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ సూర్యకాంత్
- 'నల్సా వీర్ పరివార్ సహాయతా యోజన 2025' ప్రారంభం

3

## బనకచర్లపై జంగ్ సైరన్.. చంద్రబాబూ..



- ఇక్కడ కేసీఆర్ ఉన్నడని మరువకు ఏపీ జల దోపిడీని అడ్డుకుంటం : కేటీఆర్
- చంద్రబాబు కోవర్టు రేవంత్‌కు బుద్ధిచెప్పాలె
- తెలంగాణ హక్కులు గురుదక్షిణగా ఇస్తున్నడు
- మేడిగడ్డ బరాజ్ పగుళ్ల వెనుక కాంగ్రెస్ కుట్ర!
- పిల్లర్ల వద్ద పెద్ద శబ్దం వచ్చినట్టు కొందరు చెప్పిండ్రు
- ఎన్నికల హడావుడిలో పడి దాన్ని పట్టించుకోలే
- రేవంత్ తొత్తుల్లా పనిచేస్తున్న పోలీసులు, అధికారులను వదిలిపెట్టం.. మిత్తితో సహా చెల్లిస్తం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

**సూర్య హైదరాబాద్**

గోదావరి నీళ్లను చెరబట్టేందుకు ఏపీ చేపట్టిన బనకచర్లకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ సహా బీఆర్ఎస్వీ జంగ్ సైరన్ మోగించింది. కాళేశ్వరం, బనకచర్ల ప్రాజెక్టులపై అవగాహన కల్పించేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ దిశానిర్దేశంలో ఉప్పల్‌లోని మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్స్‌లో శనివారం జరిగిన - మిగతా 2లో

## మరింత కొత్తగా సీఎంఆర్ఎఫ్

- దరఖాస్తుదారు వాట్సాప్‌కే చెక్కు వివరాలు
- సీఎం రేవంత్ సందేశంతో ప్రత్యేకంగా డిజైన్
- 19 నెలల్లో 3.23లక్షల మందికి సాయం

వివరాలు 2లో..





## హక్కుల సంరక్షకులు న్యాయవాదులు

- ఎల్లప్పుడూ న్యాయం పక్షానే ఉండాలి: శ్రీధర్ బాబు
- రాజ్యాంగ పీఠిక ప్రకారం సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందరికీ అందించేందుకు కృషి చేయాలి
- ఎల్లప్పుడూ న్యాయం పక్షానే ఉండాలి'

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఏపీ డీఎస్పీల మృతి


- ఏఎస్పీ, కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు
- సడన్ బ్రేక్ వేసిన ముందు వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పిన కారు
- రోడ్డు క్రాసింగ్‌లో డివైడర్‌ను ఢీకొట్టి... అవతలివైపు దూసుకెళ్లి పడిన వైనం
- దాన్ని ఢీకొట్టిన కాంక్రీటు మిక్సర్ లారీ
- అమరావతి నుంచి హైదరాబాద్ వస్తుండగా చౌటుప్పల్ వద్ద ప్రమాదం

3





## టీచర్ల పదోన్నతులకు పచ్చజెండా



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం
- ప్రమోషన్లు పొందనున్న 4 వేల మంది
- త్వరలో ఎస్జీటీలీ, స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు
- రెండు రోజుల్లో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం
- ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పదోన్నతులు కల్పిస్తామని హామీ

**సూర్య హైదరాబాద్**

ప్రభుత్వ ఉపాధ్యాయుల పదోన్నతులకు సర్కారు ఆమోదం తెలిపింది. ఈ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించి, పూర్తిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి శనివారం విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యాశాఖలో తొమ్మిదేళ్ల తర్వాత పదోన్నతులు, - మిగతా 2లో



## బీసీలు రేవంత్‌రెడ్డిని క్షమించరు

- 42% రిజర్వేషన్లలో 10% ముస్లింలకే పోతాయి
- కాంగ్రెస్ బీసీలను దగా చేస్తోంది
- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి
- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్రావు పిలుపు

2

## ఫర్టిలిటీ సెంటర్‌లో ఘరానా మోసం

- రెండేళ్ల తర్వాత వెలుగులోకి దారుణం
- బాబుకు క్యాన్సర్ రావడంతో అనుమానం
- డీఎన్ఏ పరీక్షల్లో బట్టబయలైన మోసం
- సికింద్రాబాద్‌లోని సృష్టి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్‌పై దంపతుల ఫిర్యాదు
- పోలీసులు, వైద్యులు, అధికారుల తనిఖీలు
- లైసెన్స్ లేకుండా కొనసాగుతున్న కేంద్రం








**సూర్య హైదరాబాద్**

సికింద్రాబాద్‌లోని ఓ సంతాన సాఫల్య కేంద్రంలో ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. సంతానం కోసం వచ్చే దంపతుల వీర్యం, అండాలను కాకుండా.. దాతల నుంచి సేకరించిన వీర్యంతో సంతానం కలిగిస్తున్నట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో.. బాధిత దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ వెంటనే పోలీసులు, రెవెన్యూ అధికారులు, వైద్యాధికారులు ఆ కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. పోలీసుల కథనం ప్రకారం.. సంతానం లేని ఓ జంట రెండేళ్ల క్రితం సికింద్రాబాద్‌లోని సృష్టి టెస్ట్‌ట్యూబ్ సెంటర్‌ను ఆశ్రయించింది. వారిని పరీక్షించిన వైద్యులు.. భర్త వీర్యకణాలతో ఐవీఎఫ్ విధానం - మిగతా 2లో



## రెండో రాజధాని స్థాయిలో వరంగల్‌లో ప్రగతి పనులు

- ఇందిరమ్మ ఇళ్ల సమస్యలకు టోల్‌ఫ్రీ నంబరు : రెవెన్యూ మంత్రి పొంగులేటి
- "ఓరుగల్లు అభివృద్ధికి సంబంధించి డీపీఆర్, పనుల టెండర్లు తదితర అంశాలపై లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి
- మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధికి కావాల్సిన భూసేకరణను యుద్ధప్రాతిపదికన చేపట్టాలి

# ఫర్టిలిటీ సెంటర్‌లో ఘరానా మోసం

-మొదటిపేజీ తరువాయి

ద్వారా మహిళ గర్భం దాల్చేలా చేశారు. ఆ తర్వాత మహిళ మగబిడ్డకు జన్మనిచ్చింది. శిశువు తరచూ అనారోగ్యానికి గురవుతుండటంతో.. ఆ దంపతులు పరీక్షలు చేయించారు. ఫలితాల్లో బాబుకు క్యాన్సర్ ఉన్నట్లు తేలింది. తమ కుటుంబంలో ఎవరికీ లేని వ్యాధి బాబుకు ఎందుకు వచ్చిందో అర్థం కాని ఆ దంపతులు.. అనుమానంతో సృష్టి సంతాన సాఫల్య కేంద్రం నిర్వాహకులను నిలదీశారు. వారు పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో.. బాధిత దంపతులు గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ బాబుకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించగా.. వీర్యదాత ద్వారా ఆ బిడ్డ జన్మించినట్లు తేలింది. దాంతో పోలీసులు సదరు ఫర్టిలిటీ కేంద్రంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాల్ నేతృత్వంలోని గోపాలపురం పోలీసుల బృందం.. వైద్యాధికారులు, సికింద్రాబాద్ ఆర్డీవో, మారేడుపల్లి తహసీల్దార్ శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి వరకు సృష్టి టెస్ట్‌ట్యూబ్ సెంటర్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఏడేళ్ల క్రితమే ఈ కేంద్రాన్ని సీజ్ చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. అయితే.. నిర్వాహకులు గుట్టుచప్పుడు కాకుండా.. రహస్యంగా దందాను నిర్వహిస్తున్నట్లు పోలీసులు నిగ్గుతేల్చారు. ఫర్టిలిటీ సెంటర్ డాక్టర్ నమ్రత తమ కేంద్రంపై కేసు నమోదవ్వగానే విజయవాడలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయారు. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు విజయవాడలోని గురునానక్ కాలనీకి చేరుకుని, పటమట పోలీసుల సహకారంతో నమ్రతను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత ఆమెను హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. ఆమెకు నెల్లూరు, విజయవాడ, విశాఖపట్టణాల్లో కూడా ఫర్టిలిటీ సెంటర్లు ఉన్నట్లు గుర్తించి, అక్కడి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. అక్కడా తనిఖీలు నిర్వహించారు. విశాఖలోని జిల్లాపరిషత్ జంక్షన్‌లో ఉన్న సృష్టి టెస్ట్‌ట్యూబ్ సెంటర్‌పైనా హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో కీలక ఆధారాలను సేకరించినట్లు తెలిసింది. సెంటర్ ఇన్‌చార్జి సీహెచ్ కల్యాణితోపాటు.. మరికొందరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇక్కడి సెంటర్‌ను 2018లో ఏర్పాటు చేయగా.. 2023 నుంచి రెన్యూవల్ చేసుకోలేదని విశాఖ వైద్యాధికారులు వెల్లడించారు. సికింద్రాబాద్‌లోని సృష్టి టెస్ట్‌ట్యూబ్ సెంటర్‌లో ఖరీదైన వైద్యపరికరాలున్నట్లు వైద్యాధికారులు గుర్తించారు. మూడంతస్తుల భవనంలో ఒక అంతస్తులో డాక్టర్ నమ్రత ఇల్లు, మరో అంతస్తులో ఆమె కుమారుడి(లాయర్)కి సంబంధించిన కార్యాలయం, ఇంకో అంతస్తులో ఫర్టిలిటీ సెంటర్ కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌తోపాటు.. పలు రాష్ట్రాల దంపతులకు ఇక్కడ వైద్యం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

**భారీగా వీర్యం నిల్వలు?**

పోలీసులు సృష్టి సంతాన సాఫల్య కేంద్రం నుంచి కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఫ్రీజర్‌లో భారీ ఎత్తున వీర్యం నిల్వలున్నట్లు గుర్తించారు. ఆస్పత్రి కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌ను సీజ్ చేసి, మరింత సమాచారాన్ని సేకరించడానికి అందులోని డాటాను విశ్లేషిస్తున్నారు. వీడియో రికార్డింగ్ మధ్య సోదాలు, తనిఖీలను కొనసాగించారు. ఈ క్రమంలో పలువురు సిబ్బంది వాంగ్మూలాలను సేకరించారు. తాము ఆ కేంద్రంలో వైద్యం చేయడం లేదని డాక్టర్ నమ్రత చెప్పగా.. లేదులేదు.. వైద్యం కొనసాగుతోందని సిబ్బంది వాంగ్మూలం ఇవ్వడం గమనార్హం..! అటు విశాఖపట్నం సెంటర్‌లో కూడా భారీగా వీర్యం నిల్వలు లభ్యమైనట్లు సమాచారం. కాగా.. పోలీసులు, వైద్యులు, రెవెన్యూ అధికారుల సంయుక్త తనిఖీల వివరాలను ఆదివారం వెల్లడిస్తామని డీసీపీ రష్మీ వెల్లడించారు. ఈ కేంద్రంలో అక్రమంగా ఐవీఎఫ్ నిర్వహిస్తున్నట్లు తెలుస్తోందని, జిల్లా వైద్యాధికారులు లోతైన దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. ప్రాథమిక విచారణ పూర్తయ్యాక.. మీడియాకు వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

# అన్నీ స్విగ్గీ పాలిటిక్స్!

-మొదటిపేజీ తరువాయి

అవసరం ఉందన్నారు. దేశ రాజకీయాల్లో ధన ప్రవాహం తగ్గించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు సహేతుక సూచనలు చేస్తే తీసుకోవడానికి తమకు ఎలాంటి ఇబ్బంది లేదని.. తాను సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు శాసనసభ నుంచి ఎవరినీ సస్పెండ్ చేయలేదని రేవంత్ చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో క్యాపిటల్ ఫౌండేషన్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన 'జైపాల్‌రెడ్డి మెమోరియల్ అవార్డుల' ప్రదానోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. అవార్డులను అందజేసి, మాట్లాడారు. దేశ రాజకీయాల్లో జైపాల్‌రెడ్డి నిలువెత్తు శిఖరమని కొనియాడారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా దేశ రాజకీయాల్లో బలమైన ముద్ర వేసిన వ్యక్తి జైపాల్‌రెడ్డి అని, చివరి శ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. "జైపాల్‌రెడ్డి పెట్రోలియం శాఖ నిర్వహిస్తున్న సమయంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారు. సమాచార మంత్రిగా ఉన్న సమయంలో ప్రసార భారతి చట్టాన్ని దేశానికి అందించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల పాత్ర, మీడియా పాత్ర ఉండాలని ఆయన విశ్వసించారు. పరిపాలనలో తీసుకురావాల్సిన మార్పులపై ఎక్కువగా ఆలోచించేవారు. రాజకీయాలలో ధన ప్రవాహం తగ్గించాలని ప్రయత్నించారు. తెలంగాణ ఏర్పాటులో జైపాల్‌రెడ్డిది కీలక పాత్ర. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత సుష్మా స్వరాజ్‌ను ఒప్పించి తెలంగాణ బిల్లుకు ఆమోదం లభించేలా ప్రత్యేక పాత్ర పోషించారు. జైపాల్‌రెడ్డి చొరవతోనే తెలంగాణ ఏర్పాటు చేశామని సోనియా గాంధీ ఒక సందర్భంలో నాతో చెప్పారు" అని రేవంత్ వెల్లడించారు. మన తెలంగాణ నేతలెవరూ ఈ విషయం చెప్పకపోయినా, పక్కరాష్ట్రం నేత ఉండవల్లి అరుణ్‌కుమార్ పలుమార్లు ప్రస్తావించారని గుర్తుచేశారు. తెలుగు రాజకీయాల్లో పీవీ నర్సింహారావు తర్వాత మళ్లీ అంత గొప్ప రాజకీయాలు చేసింది జైపాల్‌రెడ్డి అని కొనియాడారు. పని చేసుకుపోవడమే తప్ప, గొప్పలు చెప్పుకొనే తత్వం




జైపాల్‌రెడ్డిది కాదన్నారు. ఇప్పుడు ఉద్యమం చేశామని చెప్పుకొంటూ తిరుగుతున్నవారు ధర్నాచౌక్ ఎత్తివేసి ప్రజలు నిరసన వ్యక్తం చేయడానికి అవకాశం లేకుండా చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం రాగానే ధర్నాచౌక్‌ను పునరుద్ధరించామని చెప్పారు. ఎవరైనా నిరభ్యంతరంగా నిరసన తెలపవచ్చని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తుందని పేర్కొన్నారు. కాగా, ఈ రోజుల్లో రాజకీయ పార్టీలన్నీ ప్రజాస్వామ్యాన్ని విచ్ఛిన్నం చేసేలా నడుచుకుంటున్నాయని ఒడిశాకు చెందిన బీజేడీ రాజ్యసభ సభ్యుడు సస్మిత్‌పాత్ర పేర్కొన్నారు. పార్లమెంట్‌లో కూడా భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తున్నారని, సభ్యులతో చర్చించకుండానే బిల్లులని పాస్ చేస్తున్నారని ఆరోపించారు.

**అధ్యాపకులు నిత్య విద్యార్థులు..**

అధ్యాపకులు నిత్య విద్యార్థులని, వారు ప్రజాస్వామ్య విలువలను కాపాడేలా విద్యార్థులకు బోధించాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద గ్రామానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ సామ రవీందర్‌రెడ్డి రచించిన ఇండియన్ ఎకనామిక్ పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. విద్యార్థులకు ఉపయోగపడేలా పుస్తకం రాశారని రవీందర్‌రెడ్డిని అభినందించారు.

**ఆరోగ్య శ్రీలో 10.7 లక్షల మందికి వైద్యం: దామోదర రాజనర్సింహ**

తాము వచ్చాక 10.70 లక్షల మందికి ఆరోగ్యశ్రీ సేవలందించామని మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. ప్రభుత్వానికి సహకరిస్తూ రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరోగ్యశ్రీ ఇన్సూరెన్స్ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని దామోదర గుర్తు చేశారు. అలాగే సుమారు పదేళ్ల తర్వాత ఆరోగ్యశ్రీ ప్యాకేజీల ధరలను సగటున 22 శాతం మేర పెంచామని తెలిపారు. నెట్‌వర్క్ హాస్పిటళ్లకు రూ.1,590 కోట్లకు పైగా ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించామని స్పష్టం చేశారు. షుగర్ పేషెంట్లకు ఇచ్చే మందులు, ఇన్సులిన్ లేవని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

# బీసీలు రేవంత్‌రెడ్డిని క్షమించరు

మహబూబ్‌నగర్

ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పాలమూరు పర్యటనలో భాగంగా శనివారం మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. "తెలంగాణలో కులగణన సర్వే ఒక బూటకం. ఈ సర్వేలో బీసీలు 46 శాతం అని తేలింది. కానీ వారికి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెబుతున్నారు. అందులో 10 శాతం ముస్లింలకే పోతాయి. మీరు(రేవంత్‌రెడ్డి) ఇచ్చేది కేవలం 36 శాతం మాత్రమే. కాంగ్రెస్ బీసీలను దగా చేస్తోంది. మీరు ప్రధాని మోదీని కన్వర్టెడ్ బీసీ అంటున్నారు. మతమార్పిడులు ఉంటాయి కానీ, కులమార్పిడులు ఉండవు. ఈ విషయం మీకు రాహుల్‌గాంధీ చెప్పలేదా? భాజపా ఒక బీసీని ప్రధానిని చేసింది. కేంద్ర క్యాబినెట్‌లో 27 మంది బీసీలున్నారు. మీ క్యాబినెట్‌లో కేవలం ఇద్దరే ఉన్నారు. మీరా బీసీల గురించి మాట్లాడేది? బీసీ కమిషన్ పెట్టిందే భాజపా. కేంద్ర ప్రభుత్వం చేస్తేనే కులగణన విజయవంతం అవుతుంది. మిమ్మల్ని బీసీ బిడ్డలు క్షమించరు. గురుకులాల్లో చదువుతున్న బడుగు, బలహీన వర్గాల పిల్లలు అనారోగ్యంతో ఆసుపత్రుల పాలవుతున్నారు. మీ ప్రభుత్వం ఏం చేస్తోంది? ఎంపీ డీకే అరుణ పాలమూరు విశ్వవిద్యాలయానికి రూ.100 కోట్లు ఇచ్చారు. మీరేం ఇచ్చారు? భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్‌లు పాలమూరును పట్టించుకోలేదు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడంలో విఫలమయ్యాయి. పార్టీ తల్లిలాంటిది. ద్రోహం చేస్తే చర్యలుంటాయి. కలిసికట్టుగా పనిచేసి భాజపా బలోపేతానికి కృషి చేయాలి" అని రామచందర్‌రావు పిలుపునిచ్చారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే భాజపా ప్రభుత్వం రావాలని పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. "పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును నాడు కేసీఆర్ నార్లాపూర్ నుంచి మొదలు పెట్టడం వల్ల పాలమూరుకు అన్యాయం జరుగుతోంది. పాత డిజైన్‌తోనే నిర్మించాలి. లేదంటే పోరాటం చేస్తాం. నేనే నాయకత్వం వహిస్తా' అని అన్నారు. కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యురాలు పద్మజారెడ్డి, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.




## టీచర్ల పదోన్నతులకు పచ్చజెండా

-మొదటిపేజీ తరువాయి

ఆరేళ్ల తర్వాత బదిలీలను గత ఏడాది నిర్వహించారు. దాదాపు 20 వేల మందికి పదోన్నతులు కల్పించారు. అయితే గత ఏడాది కాలంలో ఖాళీ అయిన స్థానాలను పదోన్నతులతో భర్తీ చేయాల్సి ఉంది. అంతకంటే ముందు బదిలీలు చేపట్టాల్సి ఉంది. ఈ ప్రక్రియ అంతా వేసవి సెలవుల్లో జరగాల్సి ఉండగా.. జాప్యమైంది. ఇప్పటికే విద్యాసంవత్సరం ప్రారంభమైనందున ప్రభుత్వం బదిలీల అంశాన్ని వాయిదా వేసి పదోన్నతులకు అనుమతించింది. పదోన్నతుల షెడ్యూల్ సోమవారం విడుదలయ్యే అవకాశముంది. రాష్ట్రవ్యాప్తంగా 850 మంది ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు పొందనున్నారు. వీరిలో మల్టీజోన్-1లో దాదాపు 500మంది ఉండగా, మల్టీజోన్-2లో 350 మంది వరకు ఉంటారు. అలాగే దాదాపు 3వేల మంది వరకు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులు పదోన్నతులు పొందనున్నారు. ఏడాది కాలంగా ఎదురుచూస్తున్న పదోన్నతులపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని ఉపాధ్యాయ సంఘాలు స్వాగతించాయి. ఈ మేరకు టీఎసయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చావ రవి, వెంకట్.. సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను కూడా చేపట్టాలని సీఎంను కోరారు.

## మరింత కొత్తగా సీఎంఆర్ఎఫ్

హైదరాబాద్

ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకాన్ని అక్రమాలకు, అవినీతికి ఆస్కారం లేకుండా ప్రభుత్వం పటిష్ఠంగా అమలు చేస్తోంది. ఇప్పటికే పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు విధానాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. తాజాగా మరో కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. సీఎంఆర్ఎఫ్ సాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో పొందుపర్చిన ఫోన్ నంబరుకు చెక్కు వివరాలతో పాటు సీఎం రేవంత్ సందేశాన్ని జతచేసి పంపుతున్నారు. అలాగే చెక్కు విడుదలైన తేదీతో పాటు దరఖాస్తు చేసిన ప్రజాప్రతినిధి కార్యాలయానికి ఎప్పుడు చేరుతుందనే వివరాలను కూడా మెసేజ్ రూపంలో లబ్ధిదారులకు అందిస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలోని కొంతమంది ప్రజాప్రతినిధులు వారి పరిధిలో అందించే సీఎంఆర్ఎఫ్ చెక్కులపై ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ సందేశాన్ని తొలగించి లబ్ధిదారులకు అందిస్తున్నట్టు ప్రచారం జరిగింది. ఒకటి, రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సీఎం సందేశం లేకుండా ఇచ్చిన చెక్కులు కూడా బహిర్గతమయ్యాయి. ఈ క్రమంలోనే అధికారులు సీఎంఆర్ఎఫ్ దరఖాస్తు ప్రక్రియను ఆన్‌లైన్ చేసినట్టుగానే.. లబ్ధిదారులకు అందించే చెక్కుల వివరాలను కూడా వారి వాట్సాపకే పంపుతున్నారు. అలాగే చికిత్సకు ముందు ఆస్పత్రులకు ఇచ్చే లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) పత్రాలపైనా ప్రత్యేకంగా 'క్యూఆర్ కోడ్'లను ముద్రిస్తున్నారు. ఆ కోడ్‌ను స్కాన్ చేయగానే ఆ లెటర్ ఎవరికి ఇచ్చారు, ఆ పేషంట్ పేరు, మంజూరు చేసిన నగదు వివరాలన్నీ కనబడుతున్నాయి. మరోవైపు.. సీఎంఆర్ఎఫ్ సాయంలో ప్రభుత్వం రికార్డు నెలకొల్పింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 19 నెలల కాలంలోనే సీఎంఆర్ఎఫ్ కింద రూ.1,399.21 కోట్ల నిధులను విడుదల చేసింది. 2023 డిసెంబరు 7 నుంచి 2025 జూలై 26నాటికి దాదాపు 3,23,739 మంది నిరుపేద, పేద, మధ్య తరగతి కుటుంబాలకు సర్కారు వివిధ రూపాల్లో సాయం అందించింది. చికిత్సకు ముందు అందించే లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ)ల ద్వారా 27,872 మందికి రూ.413.25 కోట్లు, అలాగే చికిత్స అనంతరం దరఖాస్తు చేసుకున్న 3,01,867 మందికి రూ.985.96 కోట్ల చొప్పున నిధులను విడుదల చేసింది.

## రెండో రాజధాని స్థాయిలో వరంగల్‌లో ప్రగతి పనులు

హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా వరంగల్ నగరాన్ని రాష్ట్రానికి రెండో రాజధానిగా చేయాలన్న సంకల్పంతో పని చేస్తున్నామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సచివాలయంలో శనివారం మంత్రులు సీతక్క, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి వరంగల్ నగర అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. "ఓరుగల్లు అభివృద్ధికి సంబంధించి డీపీఆర్, పనుల టెండర్లు తదితర అంశాలపై లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధికి కావాల్సిన భూసేకరణను యుద్ధప్రాతిపదికన చేపట్టాలి. భూసేకరణకు రూ.205 కోట్లను విడుదల చేశాం. కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్‌కు సంబంధించి రాజీవ్‌గాంధీ టౌన్‌షిప్‌లో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద 1,398 మంది లబ్ధిదారులను గుర్తించి 863 ప్లాట్‌లు కేటాయించాం. సెప్టెంబరు చివరి నాటికి ఇక్కడ మౌలిక వసతుల కల్పన పూర్తి కావాలి. 2057 సంవత్సర జనాభాను దృష్టిలో పెట్టుకుని రూ.4,170 కోట్లతో వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. భద్రకాళి ఆలయ మాడవీధులు, కల్యాణ మండపం తదితర పనులు దసరా నాటికి పూర్తి చేసే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలి. భద్రకాళి చెరువులో మట్టిని వర్షాకాలం పూర్తయిన వెంటనే తరలించాలి. వరంగల్‌లో క్రికెట్ స్టేడియానికి అవసరమైన భూమిని గుర్తించాలి. హాస్టళ్లలో విద్యార్థులకు, ఆసుపత్రుల్లో రోగులకు మరింత సేవలు అందించడానికి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలి' అని అధికారులకు పొంగులేటి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కె.నాగరాజు, గండ్ర సత్యనారాయణ, నాయిని రాజేందర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, అంజిరెడ్డి, బండా ప్రకాశ్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

**ఆగస్టు 15లోపు రెండు పడకల గదుల ఇళ్లను కేటాయించాలి..**

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా స్థలాలు లేని వారికి అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆగస్టు 15లోపు కేటాయించాలని జిల్లా కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. 'అసంపూర్తిగా ఉన్న రెండు పడకల గదుల ఇళ్లను పూర్తి చేయడానికి ప్రభుత్వమే లబ్ధిదారులకు రూ.5లక్షల ఆర్థిక సహాయం అందిస్తుంది. ఈ ఇళ్లకు ఇప్పుడు దరఖాస్తు చేసుకున్న వారి పేర్లనూ పరిశీలించాలి' అని కలెక్టర్లకు మంత్రి సూచించారు.

## హక్కుల సంరక్షకులు న్యాయవాదులు

హైదరాబాద్

న్యాయవాదులు కేవలం కోర్టు అధికారులు మాత్రమే కాదని, రాజ్యాంగం దేశ ప్రజలకు ప్రసాదించిన హక్కులకు సంరక్షులు అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కొనియాడారు. ప్రపంచ యవనికపై తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తున్న హైదరాబాద్ 'ఎమర్జింగ్ లీగల్ టెక్ హబ్'గా మారుతోందని అన్నారు. నోవాటెల్ హెచ్ఐసీసీలో లెక్స్ విట్‌నెస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'ది గ్రాండ్ మాస్టర్ 2025' హైదరాబాద్ ఎడిషన్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. 'ఒక న్యాయవాదిగానే నా ప్రస్థానం మొదలయ్యింది. ఆ తర్వాత అనుకోని పరిస్థితుల్లో రాజకీయాల్లోకి వచ్చాను.

అప్పటికీ.. ఇప్పటికీ న్యాయ వ్యవస్థలో అనేక మార్పులొచ్చాయి. ముఖ్యంగా సాంకేతికత వినియోగం గణనీయంగా పెరిగింది. ఏఐ ఆధారిత న్యాయ పరిశోధన, వర్చువల్ కోర్టు రూమ్‌లు, రియల్ టైమ్ కేసు ట్రాకింగ్, ఈ-ఫైలింగ్ లాంటివి అందుబాటులోకొచ్చాయి. న్యాయవాద వృత్తిని కేవలం జీవనోపాధిగా మాత్రమే చూడొద్దు. సమాజం పట్ల ఒక బాధ్యతగా భావించాలి. రాజ్యాంగ పీఠిక ప్రకారం సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందరికీ అందించేందుకు కృషి చేయాలి. ఎల్లప్పుడూ న్యాయం పక్షానే ఉండాలి' అని ఆయన యువ న్యాయవాదులకు సూచించారు. కార్యక్రమంలో లెక్స్ విట్‌నెస్ ప్రతినిధులు అభిజిత్, శ్రీనివాస్, పలు కంపెనీల లీగల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మేకిన్ ఇండియా అస్త్రాల సత్తా చాటాం

చెన్నై

మేకిన్ ఇండియాలో భాగంగా తయారైన ఆయుధాలతో శత్రువులను మట్టి కరిపించామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. స్వదేశీ ఆయుధాల బలమేంటో ప్రపంచానికి చాటామన్నారు. శనివారం రాత్రి 8 గంటలకు మాల్దీవుల నుంచి ప్రత్యేక విమానంలో నేరుగా తమిళనాడులోని తూత్తుకుడికి ప్రధాని వచ్చారు. రూ. 4,900 కోట్ల వ్యయంతో చేపట్టిన తూత్తుకుడి విమానాశ్రయ నూతన టెర్మినల్ నిర్మాణం, వీవోసీ పోర్ట్ ఉత్తర కార్గో బెర్త్–3 నిర్మాణం ప్రారంభించారు. అలాగే పలు రైల్వే ప్రాజెక్టులు జాతికి అంకితం చేశారు. కూడన్‌కుళం అణువిద్యుత్ కేంద్రం 3, 4 యూనిట్ల నుంచి విద్యుత్ తరలింపు కోసం ఐఎస్‌టీఎస్ కింద ట్రాన్స్‌మిషన్ వ్యవస్థకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని అమరజవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "ఆపరేషన్ సింధూర్‌లో మేకిన్ ఇండియా ఆయుధాలు ఎంతో ప్రభావం చూపాయి. కీలక పాత్ర పోషించాయి. వాటితోనే తీవ్రవాదులను మట్టిలో కలిపేశాం. దేశంలో తయారయ్యే ఆయుధాలు ఉగ్రవాదానికి ఆశ్రయమిచ్చే వారికి నిద్ర లేకుండా చేస్తున్నాయి. నాలుగు రోజుల విదేశీయానం తరువాత నేరుగా రామేశ్వరం వంటి పవిత్ర భూమికిపైకి వచ్చే అదృష్టం నాకు కలిగింది. భగవాన్ శ్రీరాముడు, తిరుచ్చెందూర్ మురుగన్‌ల ఆశీర్వాదంతో తమిళనాట కొత్త అధ్యాయం లిఖితమవుతోంది. 2014లో తమిళనాడు అభివృద్ధిలో పరుగులు పెట్టే ప్రణాళికలు రచించాం. వాటి ఫలితమే ఇప్పుడు తూత్తుకుడి విమానాశ్రయం, పోర్టు విస్తరణ వంటివి జరుగుతున్నాయని చెప్పారు. నా విదేశీ పర్యటనలో చరిత్రాత్మక భారత్–యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేశాం. ఇది దేశంపై ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న నమ్మకాన్ని, దేశ నూతన ఆత్మవిశ్వాసాన్ని సూచిస్తుంది. ఈ ఆత్మవిశ్వాసంతో వికసిత భారత్‌ను నిర్మిస్తున్నాం. మహాకవి సుబ్రమణ్య భారతీయార్ కూడా తూత్తుకుడి గడ్డపై జన్మించారు. ఆయనకు తూత్తుకుడితో పాటు నా నియోజకవర్గం కాశీతో కూడా గాఢానుబంధముంది. అందుకే కాశీ–తమిళ సంగమం వంటి కార్యక్రమాల ద్వారా మన ఉమ్మడి సాంస్కృతిక వారసత్వాన్ని నిరంతరం బలోపేతం చేసుకుంటున్నాం. పారిశ్రామిక వృద్ధికి, ఆత్మనిర్భర్ భారత్‌కు రైల్వే జీవనాడి. గత 11 ఏళ్లలో దాని ఆధునీకరణపై దృష్టి సారించాం. నేడు దేశవ్యాప్తంగా ఆధునిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి గట్టి కృషి జరుగుతోంది. ఇటీవల ఇంజనీరింగ్ అద్భుతమైన చీనాబ్ వంతెనతో జమ్మూ–శ్రీనగర్‌ను అనుసంధానించాం. అటల్ సేతు, బోగిబీల్ వంతెన, సోన్‌మార్గ్ సొరంగం వంటివి ఎన్నో ప్రాజెక్టులను మా ప్రభుత్వం పూర్తి చేసింది. తద్వారా లక్షలాదిమందికి ఉపాధి అవకాశాలు కల్పించాం" అని పేర్కొన్నారు. తమిళ సంప్రదాయమైన పంచెకట్టులో సభకు హాజరైన ప్రధాని.. తమిళంలో ప్రసంగాన్ని ప్రారంభించి, తమిళంలోనే ముగించడం విశేషం.



# బనకచర్లపై జంగ్ సైరన్.. చంద్రబాబూ..

-మొదటిపేజీ తరువాయి

బీఆర్‌ఎస్వీ రాష్ట్రస్థాయి సదస్సు చైతన్యవంతంగా సాగింది. బనకచర్ల పేరుతో గోదావరి జలాలను తెలంగాణకు శాశ్వతంగా దూరం చేసేందుకు ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రంలోని బీజేపీ కలిసి చేస్తున్న కుట్రలను గ్రామగ్రామాన ప్రజలకు వివరించాలని విద్యార్థి నేతలకు బీఆర్‌ఎస్ నాయకత్వం సూచించింది. తెలంగాణ హక్కులను కాపాడుకొనేందుకు ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలు మళ్లీ ఉద్యమ వేదికలు కావాలని ఆకాంక్షించింది. అవసరమైతే జాతీయ రహదారులను దిగ్బంధించి.. రైలురోకోలు చేపట్టి ఢిల్లీ మెడలు వంచి బనకచర్లను ఆపుదామని పిలుపునిచ్చింది. బనకచర్ల పేరుతో గోదావరి జలాలను తెలంగాణకు శాశ్వతంగా దూరం చేసే కుట్ర జరుగుతున్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ జలహక్కులకు పిండం పెట్టే ఆ కుట్రను ఆపేందుకు కేసీఆర్ ఉన్నారని, ఆ సంగతిని రేవంత్‌రెడ్డి, చంద్రబాబు గుర్తుంచుకుంటే మంచిదని హితవు పలికారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరు నిల్చున్నా కేసీఆర్‌గా భావించి కారు గుర్తుకు ఓటెయ్యాలని పిలుపునిచ్చారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ అంటూ బీఆర్‌ఎస్ మీద కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. హైదరాబాద్ మల్లాపూర్ వీఎన్‌ఆర్ గార్డెన్స్‌లో జరిగిన బీఆర్‌ఎస్వీ రాష్ట్రస్థాయి సదస్సులో కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణ జలాలు మనకు కాకుండా చేసే గద్ద పాత్రను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పోషిస్తుందని విమర్శించారు. సముద్రంలో కలిసే 3000 టీఎంసీల గోదావరి మిగులు జలాల్లో 950 టీఎంసీలను తెలంగాణకు కేటాయించాక ఏపీలో ఏ ప్రాజెక్టు కట్టుకున్నా తమకు అభ్యంతరం లేదని స్పష్టంచేశారు. 1,486 టీఎంసీల గోదావరి నికరజలాల్లో 968 టీఎంసీలను తెలంగాణకు ఇచ్చేలా కేంద్రం ప్రకటించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**మేడిగడ్డ వెనుక కుట్ర**

సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌లోని ఇతర నేతల మాటలు చూస్తుంటే మేడిగడ్డ పగుళ్ల వెనక కుట్ర ఉన్నదని అనిపిస్తున్నదని చెప్పారు. పిల్లర్ల వద్ద శబ్దం వచ్చిందని అప్పట్లో కొందరు చెప్పినా ఎన్నికల హడావుడిలో పట్టించుకోలేదని, కానీ ఇప్పుడు నిజమని అనిపిస్తున్నదని పేర్కొన్నారు. చంద్రబాబు కోవర్టు రేవంత్‌రెడ్డి గోదావరి నీళ్లను ఆంధ్రకు అప్పగిస్తున్నారని విమర్శించారు. సముద్రంలో కలిసే గోదావరి మిగులు జలాల విషయంలో కేంద్రం నోరు విప్పాలని, తెలంగాణ వాటా తేలుస్తూ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ కేసులు పెడుతూ రేవంత్ తొత్తుల్లా వ్యవహరిస్తున్న పోలీసులు, అధికారుల పేర్లను బీఆర్‌ఎస్వీ నేతలు రాసిపెట్టుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే మిత్తితోసహా చెల్లిస్తామని హెచ్చరించారు.

**బీఆర్‌ఎస్‌పై ముప్పేట దాడి**

తెలంగాణ గొంతు కోస్తుంటే చూస్తూ ఊరుకోవడానికి బీఆర్‌ఎస్ సిద్ధంగా లేదని కేటీఆర్ హెచ్చరించారు. కాంగ్రెస్, బీజేపీ, చంద్రబాబు కలిసి తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వ పతాక అయిన బీఆర్‌ఎస్‌పై ముప్పేట దాడి చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుల మీద అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగం పట్టుకుని దేశమంతా తిరుగుతున్న రాహుల్‌గాంధీకి తెలంగాణలో రేవంత్‌రెడ్డి సాగిస్తున్న విధ్వంసక పాలన కనిపించడం లేదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అరాచకాలపై బీఆర్‌ఎస్ పోరాడితేనే మూసీ ప్రక్షాళన, లగచర్ల, కంచగచ్చిబౌలి అక్రమాలు ఆగాయని పేర్కొన్నారు.

**స్వరాష్ట్రం కోసం కదంతొక్కిన సబ్బండ వర్ణాలు**

కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలోని సబ్బండవర్ణాలు కదం తొకి స్వరాష్ట్ర ఆకాంక్షను నిజం చేసుకున్నాయని కేటీఆర్ గుర్తుచేశారు. 'తెలంగాణలో హనుమంతుని గుడి ఉండని ఊరు, కేసీఆర్ పథకం అందని ఇల్లు ఉండదు. సంక్షేమంలో స్వర్ణ యుగంలాగా కేసీఆర్ పాలన సాగింది. రైతు బంధు కింద రైతు పెట్టుబడి సాయంగా రూ.73 వేల కోట్ల రూపాయలను 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో వేసిన ఒకే ఒక ముఖ్యమంత్రి భారతదేశంలో కేసీఆర్. ఏ కారణం చేత రైతు చనిపోయినా ఆ కుటుంబం రోడ్డున పడొద్దని ప్రపంచంలో ఎకడా లేనివిధంగా రూ.5 లక్షలతో రైతు బీమాను అమలు చేశారు. 200 వృద్ధాప్య పింఛన్‌ను 2 వేలకు, 500 వికలాంగుల పెన్షన్‌ను 6000కు పెంచారు' అని గుర్తుచేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఏపీ సర్కారు బనకచర్ల ప్రాజెక్టు కడుతున్నది. సెంట్రల్ వాటర్ కమిషన్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్, సీడబ్ల్యూసీల క్లియరెన్స్, అపెక్స్ కౌన్సిల్ పర్మిషన్ లేకుండానే బనకచర్లను నిర్మిస్తున్నది. దీనికి తెలంగాణలోని రేవంత్ సర్కారు వంతపాడుతున్నది. తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వ పతాక అయిన బీఆర్‌ఎస్‌ను లేకుండా చేసేందుకు చంద్రబాబుతో కలిసి కాంగ్రెస్, బీజేపీ ఒక్కటైనై.

**తెలంగాణ వ్యతిరేకులు రెచ్చిపోతున్నరు**

ఎలాంటి అనుమతులు లేకుండా ఏపీ సర్కారు బనకచర్ల ప్రాజెక్టును కడుతున్నదని కేటీఆర్ విమర్శించారు. సెంట్రల్ వాటర్ కమిషన్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్, సీడబ్ల్యూసీల క్లియరెన్స్, అపెక్స్ కౌన్సిల్ పర్మిషన్ లేకుండా బనకచర్లను కడుతున్నారని మండిపడ్డారు. 'అన్ని ప్రభుత్వాలు ఫోన్ ట్యాపింగ్ చేస్తాయి. మేం కూడా చేస్తున్నామని మొన్న ఢిల్లీ చిట్‌చాట్‌లో రేవంత్‌రెడ్డి చెప్పాడు. హామీల అమలుపై ప్రజలు అడగొద్దని హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ అయ్యాయని కల్పిత కథలు సృష్టించారు. బీఆర్‌ఎస్‌ను లేకుండా చేయడానికి కాంగ్రెస్, బీజేపీ, చంద్రబాబు ఒకటయ్యారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న పదేండ్లు మాట్లాడటానికి కూడా భయపడ్డ తెలంగాణ వ్యతిరేకులు.. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే విర్రవీగుతూ మాట్లాడుతున్నారు' అని కేటీఆర్ ఫైరయ్యారు.

**కాంగ్రెస్‌కు మీడియా వత్తాసు**

ప్రధాన మీడియా అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తున్నదని కేటీఆర్ విమర్శించారు. 'మనకు ఉన్న ఒకే ఒక్క ఆయుధం సోషల్ మీడియా. దానిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోండి. ప్రజా సమస్యలను విస్తృతంగా సోషల్ మీడియాలో చూపించండి. బీఆర్‌ఎస్ నేతల వ్యక్తిత్వాలను కించపరిచే స్లాటర్ హౌస్‌ల లాగా మీడియా సంస్థలు పనిచేస్తున్నాయి. రీట్వీట్ చేసినందుకు సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉండే శశిధర్‌గౌడ్‌ను 20రోజులు జైల్లో పెట్టింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం' అని విమర్శించారు.

**యుద్ధభూమిగా హెచ్‌సీయూ**

మూసీ ప్రక్షాళనలోని లక్షన్నర కోట్ల కుంభకోణాన్ని బీఆర్‌ఎస్ బయట పెట్టినంకనే రేవంత్‌రెడ్డి లాగులు తడిచాయని కేటీఆర్ అన్నారు. 'మనం పోరాటం చేస్తేనే మూసీ కుట్రలు ఆగాయి. లగచర్ల ఆడబిడ్డలకు బీఆర్‌ఎస్ అండగా నిలిచింది. కంచ గచ్చిబౌలి సెంట్రల్ యూనివర్సిటీ భూముల విషయంలో విద్యార్థుల వీరోచిత ఉద్యమం ముందు ప్రభుత్వం ఓడింది. బీఆర్‌ఎస్వీ పోరాటాలకు మన లీగల్ సెల్ అండగా నిలిచింది. పోరాడిన వారికే అవకాశాలు వస్తాయి. త్వరలో కొత్త బీఆర్‌ఎస్వీ కమిటీని ఏర్పాటుచేస్తాం. కొత్త యువరక్తానికి అవకాశం కల్పిస్తాం' అని పేర్కొన్నారు.

**14వ ర్యాంకు నుంచి టాప్‌లోకి**

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడే నాటికి వరి ఉత్పత్తిలో దేశంలోనే 12వ స్థానంలో ఉన్న తెలంగాణను పంజాబ్, హర్యానాను వెనకి నెట్టి 2022 నాటికి దేశంలోనే నంబర్‌వన్‌గా నిలబెట్టిన నేత కేసీఆర్ అని కేటీఆర్ పేర్కొన్నారు. 'వ్యవసాయంలోనే కాదు తలసరి ఆదాయంలోనూ తెలంగాణ నంబర్‌వన్. 2014లో తలసరి ఆదాయంలో 14వ ర్యాంకు ఉన్న తెలంగాణ 2022 నాటికి తలసరి ఆదాయంలో దేశంలోనే అగ్రగామిగా ఎదిగింది. తెలంగాణలో ఐదు మెడికల్ కాలేజీలుంటే కేసీఆర్ 33 మెడికల్ కాలేజీలను ప్రారంభించారు. 200 గురుకుల స్కూళ్లను 1,022కు పెంచారు. దేశంలో 150 మెడికల్ కాలేజీలిచ్చిన మోదీప్రభు త్వం.. తెలంగాణకు ఒకటీ ఇవ్వలేదు. నవోదయ పాఠశాలలనూ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టింది' అని కేటీఆర్ దుయ్యబట్టారు. మూసీలో లక్షన్నర కోట్ల కుంభకోణాన్ని బీఆర్‌ఎస్ బయట పెట్టినంకనే రేవంత్‌రెడ్డికి లాగులు తడిచినయ్. మనం పోరాటం వల్లే మూసీ కుట్రలు ఆగినయ్. లగచర్ల ఆడబిడ్డలను ఢిల్లీ దాకా తీసుకెళ్లి బాధితుల పక్షాన నిలిచినం. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో విద్యార్థులు చేసిన వీరోచిత ఉద్యమం ముందు రేవంత్ సర్కారు ఓడింది.

**రెచ్చగొట్టిన రాహుల్ ఏడబోయిండు**

కేసీఆర్, కేటీఆర్ ఇద్దరి ఉద్యోగాలు ఊడగొడితే మొదటి సంవత్సరమే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ రెచ్చగొట్టారని కేటీఆర్ విమర్శించారు. ఇప్పుడు రాహుల్ ఏడబోయారని మండిపడ్డారు. 'తెలంగాణలో పనులన్నీ చంద్రబాబు కోవర్టులే చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేనే స్వయంగా చెప్పారు. వారం రోజులుగా ఒకో సూలుకు కాలేజీకి వెళ్లి బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించి చెప్తున్న బీఆర్‌ఎస్ విద్యార్థి నేతలకు అభినందనలు. పోరాటాన్ని ఇలానే కొనసాగించండి. అవసరమైతే పోస్ట్‌కార్డు ఉద్య మం. ఆన్‌లైన్ పిటిషన్‌ను ప్రారంభించండి. ఆడబిడ్డలకు ఇస్తానన్న 2500 నేటికీ ఇవ్వడం లేదు. 20 నెలల నుంచి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 50 వేల బాకీ ఉంది. 20 నెలల్లో తెలంగాణలో సుమారు ఏడు లక్షల వివాహాలు జరిగాయి. ఇలా ఏడు లక్షల తులాల బంగారం బాకీ ఉన్నది. బీఆర్‌ఎస్వీ అంటే విద్యార్థి విభాగమే కాదు. తెలంగాణ హకులను కాపాడేందుకు ఫ్రంట్‌లైన్‌లో ఉండి పోరాడే వీరోచిత సంస్థ. గతంలో విద్యార్థి నేతలైన బాల్క సుమన్, గాదరి కిశోర్, గెల్లు శ్రీనివాస్, బాలరాజ్‌యాదవ్ రాకేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులను కేసీఆర్ గెలిపించి పదవులు ఇచ్చారు. మహిళా రిజర్వేషన్‌తో మూడోవంతు సీట్లు ఆడబిడ్డలకి రాబోతున్నాయి' అని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు బం డారు లక్ష్మారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, బాల్క సుమన్, పార్టీ నేత రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేషన్ల చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, పల్లె రవికుమార్‌గౌడ్, చిరుమళ్ల రాకేశ్, ఆంజనేయగౌడ్, బాలరాజుయాదవ్, వాసుదేవరెడ్డి, బీసీ కమిషన్ సభ్యుడు కిశోర్‌గౌడ్, బీఆర్‌ఎస్వీ నాయకులు పడాల సతీశ్, తుంగ బాలు, కడారి స్వామియాదవ్, ధర్మేందర్‌రెడ్డి, పల్ల ప్రవీణ్‌రెడ్డి, కృష్ణ, తొట్ల స్వామియాదవ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఏపీ డీఎస్పీల మృతి

చౌటుప్పల్ రూరల్/మన్సూరాబాద్

యాదాద్రి భువనగిరి జిల్లాలో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చౌటుప్పల్ మండలం ఖైతాపురం స్టేజి వద్ద జరిగిన ఈ దుర్ఘటనలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు డీఎస్పీలు మరణించగా, మరో ఏఎస్పీ, కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ (ఎస్ఎస్‌జీ) డీఎస్పీ జల్లు శాంతారావు (56), ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎసడబ్ల్యూ) డీఎస్పీ మాకా చక్రధర్‌రావు (52), ఐఎసడబ్ల్యూ ఏఎస్పీ కేడీఎం దుర్గాప్రసాద్... విధుల్లో భాగంగా శుక్రవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో అమరావతి కార్యాలయం నుంచి డ్రైవర్‌గా ఓ కానిస్టేబుల్‌ను తీసుకుని కారులో హైదరాబాద్‌లోని కార్యాలయానికి బయలుదేరారు. నార్కట్‌పల్లి వద్దకు రాగానే వారు ప్రయాణిస్తున్న కారుకు మరమ్మతు వచ్చింది. దీంతో హైదరాబాద్ నుంచి మరో స్కార్పియో వాహనం తెప్పించుకొని డ్రైవర్‌గా హెడ్‌కానిస్టేబుల్ రెడ్డిచర్ల నర్సింగరావును తీసుకుని బయలుదేరారు. తెల్లవారుజామున 4.45 నిమిషాలకు కారు ఖైతాపురం స్టేజి వద్దకు రాగానే ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం సడన్ బ్రేక్ వేసింది. దాన్ని తప్పించబోయిన పోలీసుల కారు... క్రాసింగ్ వద్ద డివైడర్ ముందు భాగాన్ని బలంగా ఢీకొట్టి కొద్దిదూరం దూసుకెళ్లి విజయవాడ వైపు వెళ్లే రోడ్డులో పడిపోయింది. దాన్ని అదే సమయంలో హైదరాబాద్ నుంచి చౌటుప్పల్‌కు వస్తున్న కాంక్రీట్ మిక్సర్ లారీ ఢీకొట్టింది. కారు నుజ్జవగా మధ్య సీటులో కూర్చున్న డీఎస్పీలు చక్రధరరావు, శాంతారావుకు అక్కడికక్కడే మరణించారు. ముందు సీటులో కూర్చున్న ఏఎస్పీ దుర్గాప్రసాద్, డ్రైవర్ నర్సింగరావు సీటు బెల్ట్ పెట్టుకోవడం, బెలూన్లు తెరుచుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు.

**గతంలో హైదరాబాద్‌లో పనిచేశారు!**

ప్రమాదంలో మరణించిన డీఎస్పీ శాంతారావుది ఏపీలోని శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం డోలా గ్రామం. మరో డీఎస్పీ చక్రధర్‌రావుది పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు. ఆంధ్రప్రదేశ్ విభజనకు ముందు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పనిచేశారు. వీరిద్దరి కుటుంబాలు హైదరాబాద్‌లోనే నివాసం ఉంటున్నాయి. శాంతారావుకు భార్య శ్రీలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. చక్రధరరావుకు భార్య శ్రీదేవి, ఇద్దరు కుమార్తెలు హాసిని ప్రియ, డింపుల్ ఉన్నారు. ప్రియ తొమ్మిదో తరగతి, డింపుల్ ఒకటో తరగతి చదువుతున్నారు.

**హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో**

ఖైతాపురం క్రాసింగ్ అత్యంత ప్రమాదకరంగా ఉంటుంది. హెచ్చరిక బోర్డులు, లైట్లు లేకపోవడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు డివైడర్ పక్క నుంచి వాహనం వెళ్తే అంతే సంగతులు. డివైడర్‌ను ఢీకొట్టిన తర్వాత పోలీసుల వాహనం 50 మీటర్ల దూరం దూసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో వాహనం 70 కిలోమీటర్ల వేగంతో ఉన్నట్లు సమాచారం. సీటు బెల్టు పెట్టుకోకపోవడం కూడా ఇద్దరు డీఎస్పీల మృతికి కారణంగా తెలుస్తోంది.

## సైనికులకు న్యాయసేవ

భారతదేశ చరిత్రలోనే తొలిసారిగా సైనికుల కుటుంబాలకు న్యాయసహాయం అందించనున్నారు. 'నల్సా వీర్ పరివార్ సహాయతా యోజన 2025' పేరుతో ఈ కొత్త కార్యక్రమం ద్వారా భారతీయ సైనికులకు సాయం చేయనున్నారు. సొంత ఊళ్లకు దూరంగా దేశం కోసం సేవలందిస్తున్న సైనికులు, తమ కుటుంబ సభ్యులు కొన్నిసార్లు స్థానికంగా న్యాయపరమైన వివాదాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. దాంతో దేశం కోసం సుదూర ప్రాంతాల్లో పోరాడుతున్న సైనికులు స్వగ్రామాలకు రావడం కష్టంగా మారుతుంది. అలాంటివారికి, తమ కుటుంబ సభ్యులకు న్యాయసేవ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ సూర్యకాంత్ శ్రీనగర్‌లో జరిగిన కార్గిల్ విజయ్ దివాస్ సదస్సులో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు. ఇటీవల జరిగిన ఆపరేషన్ సింధూర్ తర్వాత ఈమేరకు నిర్ణయం తీసుకోవడం సైనికులకు ఎంతో వెసులుబాటు కల్పిస్తుందని నమ్ముతున్నారు. ఈ ఆపరేషన్ సమయంలో సాయుధ దళాలు చేసిన త్యాగాలను చూసి తీవ్రంగా చలించిపోయానని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. న్యాయవ్యవస్థ వారి శ్రేయస్సుకు మరింత ప్రత్యక్షంగా దోహదపడే మార్గాలను అన్వేషిస్తుందన్నారు. అందులో భాగంగా ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు.

ఈ కార్యక్రమం ఉద్దేశం..

సైనికులు విధుల్లో ఉన్నప్పుడు అపరిష్కృత ఆస్తి వివాదాలు, కుటుంబ కలహాలు, భూ సమస్యలు, ఇతర చట్టపరమైన విషయాల నుంచి ఉపశమనం కలిగించేలా న్యాయసేవ అందిస్తారు.

సైనికులు వృత్తిపరమైన కారణాలతో కోర్టుకు హాజరు కాలేకపోయినా, కోర్టులో కుటుంబాలకు ప్రాతినిధ్యం వహించడానికి నల్సా రంగంలోకి దిగుతుంది.

ఇండియన్ ఆర్మీ, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, ఐటీబీపీ, ఇతర పారామిలటరీ బలగాలు దీని పరిధిలోకి వస్తారు.

ప్యానెల్ లాయర్లు, పారాలీగల్ వాలంటీర్లకు సులభంగా అందుబాటులో ఉండేలా రాష్ట్రాల్లోని సైనిక్ వెల్ఫేర్ బోర్డులను ఏర్పాటు చేస్తారు.

కేసు పురోగతిని పర్యవేక్షించడానికి, సకాలంలో పరిష్కారాన్ని నిర్ధారించడానికి వీరు తోడ్పాటు అందిస్తారు.

## నాడు స్పీకర్ చేతిలో చివాట్లు తిన్నా

ఢిల్లీ

తాను రాజకీయాల్లోకి వచ్చిన తొలినాళ్ల నాటి అనుభవాలను, ఓ సంఘటనను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గుర్తు చేసుకున్నారు. ఢిల్లీలో శనివారం నిర్వహించిన సంసద్ రత్న అవార్డుల కార్యక్రమంలో మాట్లాడుతూ.. గతంలో లోక్‌సభ స్పీకర్ సోమనాథ్ ఛటర్జీ తో తొలిసారి భేటీ అయినప్పుడు ఆయనను స్మోకింగ్ రూం ఏర్పాటు చేయాలని కోరానని, దానికి ఆయన చివాట్లు పెట్టినట్లు వెల్లడించారు. సోమనాథ్ ఛటర్జీ లోక్‌సభ స్పీకర్‌గా ఉన్న సమయంలో ఆయనను తొలిసారి కలిసినప్పుడు ధూమపానం చేసే ఎంపీల కోసం స్మోకింగ్ రూం ఏర్పాటు చేయాలని కోరానని..దానివల్ల ఆ అలవాటు లేని వారికి ఇబ్బంది కలగదని ఆయనను అభ్యర్థించానని రిజిజు తెలిపారు. దీంతో ఆగ్రహించిన సోమనాథ్ స్పీకర్‌తో జరుగుతున్న మొదటి సమావేశంలో ఇటువంటి విషయాలు చర్చించడానికి వచ్చారా అని తనను తీవ్రంగా మందలించారన్నారు. నాటి నుంచి అత్యున్నత పదవుల్లో ఉన్న వారి దృష్టికి ఎటువంటి సమస్యలు తీసుకువెళ్లాలి, వారితో ఎలా మాట్లాడాలనే విషయాలను తెలుసుకున్నానని కేంద్రమంత్రి చెప్పుకొచ్చారు. అదే విధంగా ప్రస్తుతం ప్రజలు ఎంపీల వద్దకు వచ్చి వారి వ్యక్తిగత ఫిర్యాదులు, మౌలిక సదుపాయాల కల్పన, చట్టపరమైన సమస్యలు వంటి విషయాలను పరిష్కరించాలని అడుగుతుంటారని అన్నారు. ఎంపీలను కలిసేటప్పుడు ప్రజలు ముఖ్యమైన సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే రాజకీయ జీవితంలో ఉన్న వారికి ప్రత్యర్థి పార్టీల నాయకులు శత్రువులు కాదని అన్నారు. ఇతర ప్రతిపక్ష పార్టీల నేతలందరినీ తాను సహోద్యోగులుగానే భావిస్తానని చెప్పారు.

## హిరాకుడ్ జలాశయానికి వరదపోటు

హిరాకుడ్ జలాశయంలో వరద నీటి ఉధృతి పెరుగుతుంది. ఈ జలాశయం గరిష్ట నీటి మట్టం పరిమితి 630 అడుగులు కాగా ప్రస్తుతం 609.39 అడుగుల నీటి మట్టం కొనసాగుతుంది. నీటి మట్టం నియంత్రణలో భాగంగా అంచెలంచెలుగా వరద నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం ఎడమ వైపు 13, కుడి వైపు ఏడు.. మొత్తం మీద 20 గేట్లు తెరిచి వరద నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం లోనికి ప్రతి సెకన్‌కు 2.51 లక్షల క్యూసెక్కులు ప్రవహిస్తుండగా సెకనుకు 2.75 లక్షల క్యూసెక్కులు వరద నీరు విడుదల చేస్తున్నారు.

# పిల్లల జీవితాల్లో కీలక భూమిక అమ్మనాన్నలదే !

"మాతృదేవోభవ, పితృదేవోభవ" అంటున్నది హిందూ సమాజం. అమ్మ లేనిదే జన్మ లేదు. నాన్న లేనిదే లోక జ్ఞానం కలగదు. అమ్మ బుడిబుడి అడుగులు వేయిస్తే, నాన్న బిడ్డ చేయి పట్టి లోకాన్ని పరిచయం చేస్తాడు. అమ్మ నాన్నలే ఆది దేవతలు. శిశువుకు తొలి గురువు అమ్మ అయితే రెండవ గురువుగా నాన్న నిలుస్తాడు. పిల్లల్ని కనడానికి ముందు నుంచే అమ్మనాన్నలు సంతానవృద్ధి కోసం తమ జీవితాలను అంకితం చేస్తారు. గర్భం దాల్చిన అమ్మ నవ మాసాలు కడుపులో బిడ్డను మోసి, పోషించి, ప్రసవ వేదనను అనుభవించి, బిడ్డను కని, తను పునర్జన్మను పొంది మురిసి పోతుంది. శిశు దశ నుంచి పెరిగే ప్రతి క్షణం నాన్న పాత్రతో పాటు త్యాగం అనన్యసామాన్యంగా ఉంటుంది. అమ్మనాన్నలకు పిల్లలే ప్రపంచం, వారి అభివృద్ధే ఆనందం, వారి నవ్వులే తమ అంతిమ లక్ష్యం అని మనకు తెలుసు. తల్లితండ్రులు అయ్యే వరకు అమ్మనాన్నల పాత్ర మనకు పూర్తిగా అవగతం కాదు. నేటి డిజిటల్ యుగంలో పిల్లలకు, తల్లితండ్రులకు మధ్య ఏవో తెలియని తెరలు అడ్డుపడుతున్నాయి. తల్లితండ్రులు పిల్లలతో గడపడానికి విలువైన సమయమే సన్నపూసైంది. తల్లిదండ్రుల ప్రాధాన్యాన్ని గ్రహించి, వారితో జీవితకాలం చేతిలో చేయి వేసి నడవడం, పిల్లలతో తల్లిదండ్రుల సంబంధాలు బలపడడం, జీవిత చరమాంకంలో తల్లితండ్రులకు ఆసరాగా ఊతకర్ర వలె నిలవడం అనే లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని నాటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి ఏట నాలుగవ ఆదివారం, అనగా 27 జూలై 2025 రోజున "నేషనల్ పేరెంట్స్ డే లేదా జాతీయ తల్లితండ్రుల దినోత్సవం" పాటించడం 1995 నుంచి ఆనవాయితీగా మారింది. తల్లితండ్రులు పంచే బేషరతు ప్రేమ, పెంపకంలో చూపే ప్రత్యేక శ్రద్ధ, పిల్లల ఎదుగుదలలో చూపే అలుపెరుగని తపనలకు ప్రత్యామ్నాయం లేదు. పిల్లలు ఎదిగిన తర్వాత తమ తల్లితండ్రులను అక్కున చేర్చుకొని, ఊత కర్రగా మారి, వారి ఆయురారోగ్యాలకు మనస్ఫూర్తిగా దోహదపడాలి, అమ్మానాన్నల రుణం కొంతైనా తీర్చుకునే ప్రయత్నాలు చేయాలి. తల్లి ప్రత్యక్ష పేగు బంధం పరమ పవిత్రం. తండ్రి తెర వెనుక త్యాగాలు పిల్లల ఎదుగుదలకు మూల స్థంభాలు. జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం రోజున తమ జన్మ ప్రదాతలను తగు రీతిలో దైవ సమానంగా సన్మానించుకోవాలి. కుటుంబ పెద్దలుగా తల్లితండ్రులు తమ పిల్లలకు జీవితకాలం పాటు రక్షణ గొడుగులు. కుటుంబానికి ఇల్లు తండ్రి అయితే ఆ ఇంటి దర్వాజకు ఆకు పచ్చ తోరణం, గడపకు పసుపు పారాణి లాంటి శుభం అమ్మ అవుతుంది. 2025 జాతీయ తల్లితండ్రుల దినం వేదికగా ఎదిగిన పిల్లలకు తల్లితండ్రులను చూసుకునే బాధ్యతలను వివరించడం జరగాలి. తల్లితండ్రులు పిల్లలకు భావోద్వేగ మద్దతు, అవసర పోషణను అందించడం, ఉజ్వల భవితకు బాటలు వేయడం, లోక జ్ఞానాన్ని అందించడం, సంస్కారాలను నూరి పోయడం, క్రమశిక్షణ కల్పించగలగడం లాంటి ప్రధాన అంశాలపై దృష్టి పెడతారు. వృద్ధ తల్లిదండ్రులు పిల్లల నుండి ఆప్యాయతను మాత్రమే కోరుకుంటారని నేటి యువత తెలుసుకోవాలి. పిల్లల శారీరక, మానసిక, సామాజిక, భావోద్వేగ, ఆధ్యాత్మిక అభివృద్ధికి అమ్మానాన్నలు హద్దులు లేని మద్దతు ఇస్తారు. పిల్లల కనీస అవసరాలను తీర్చడం, విద్యాబుద్ధులు నేర్పించడం, సంరక్షణ బాధ్యతలు తీసుకోవడం, నైతిక శిక్షణను ఇవ్వడం, ప్రోత్సాహ స్ఫూర్తిని అందించడం, వివిధ సమయాల్లో అవసర సహాయం చేయడం, అవ్యాజమైన ప్రేమ – అనంతమైన ఆప్యాయతలను పంచడం, మానవ సంబంధాలను ఏర్పరచడం లాంటి గురుతర బాధ్యతలను తల్లిదండ్రులు స్వచ్ఛందంగా, తమ జీవిత ఏకైక లక్ష్యంగా తీసుకుంటారు. అలాంటి అమ్మానాన్నలను ఎదిగిన పిల్లలు చక్కగా, గౌరవంగా, భాద్యతగా, ఆప్యాయంగా చూసుకోవడం, వారి త్యాగాలకు ధీటుగా పిల్లలు తిరిగి రుణం తీర్చుకోవడం కనీస కర్తవ్యం అని తెలుసుకొని మసలు కోవాలి. అమ్మానాన్నలను ఆది దేవతలుగా భావించాలి, వారి రుణాన్ని కొంతైనా తీర్చుకునే విశ్వ ప్రయత్నం చేయాలి.



# మూత్రపిండాల వైద్యంలో ఆద్యుడు

భారతదేశ వైద్య రంగ చరిత్రలో అత్యంత గౌరవనీయ స్థానం పొందిన వైద్యులలో డాక్టర్ రాజ్ వీర్ సింగ్ యాదవ్ ముందుంటారు. ఆయనే భారత దేశంలో మొట్టమొదటి మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన శస్త్ర వైద్యుడు. ఆయన విజ్ఞాన పూరిత వైద్య నైపుణ్యంతో పాటు దేశ ప్రజల ఆరోగ్య సేవలో చేసిన అసాధారణ కృషికి గుర్తింపుగా పద్మశ్రీ అవార్డు వరించింది. దేశానికి వైద్యపరంగా మార్గ దర్శకుడిగా నిలిచిన ఈ మహోన్నత వ్యక్తిత్వం గల వైద్యుని జీవితాన్ని, సేవలను సవివరంగా విశ్లేషిద్దాం.డాక్టర్ రాజ్ వీర్ సింగ్ యాదవ్ 1937 జూలై 27న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లోని బదౌన్ జిల్లాలోని నౌలిహరనాథ్పూర్ గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్య తర్వాత లక్నో విశ్వ విద్యాలయానికి అనుబంధంగా ఉన్న కింగ్ జార్జ్ మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్హతలు పొందారు. 1961లో ఎంబీబీఎస్, 1964లో ఎంఎస్ (జనరల్ సర్జరీ) పూర్తి చేశారు. తరువాత 1974లో ఇంటర్నేషనల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్, 1977లో అమెరికన్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ సర్టిఫికెట్లను పొందారు. ఈ సాంప్రదాయ, అంతర్జాతీయ ప్రమాణాల నైపుణ్యం ఆయనకు వైద్యరంగంలో విశిష్ట స్థానం కల్పించింది. 1973లో చండీగఢ్‌లోని ప్రఖ్యాత పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ లో ఆయన నేతృత్వంలో భారతదేశపు మొట్టమొదటి మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించ బడింది. ఈ ఆపరేషన్ వైద్య చరిత్రలో ఘనతను సాధించిన మైలురాయిగా నిలిచింది. ఆ కాలంలో సాంకేతిక పరిజ్ఞానం పరిమితంగా ఉండగా, ఓ రోగికి కొత్త జీవితం ప్రసాదించడం అతని వైద్య నైపుణ్యం, ధైర్యానికి అద్భుత ఉదాహరణ. ఇది కేవలం వైద్య విజయం కాదు, దేశ ప్రజారోగ్య చరిత్రలో ఒక గొప్ప ఉపాధి క్షేత్రాన్ని తెరలేపిన సంఘటన. ఆయన వైద్య సేవలు ఢిల్లీ ప్రభుత్వాసుపత్రులలో, ముఖ్యంగా రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రి, గ్రేటర్ కాలకజీ ఆసుపత్రి వంటి ప్రఖ్యాత ఆసుపత్రులలో కొనసాగాయి. ఆయన శస్త్ర వైద్య విభాగానికి నాయకత్వం వహిస్తూ అనేకమంది శిక్షణ పొందిన వైద్యులను ట్రాన్స్ప్లాంటేషన్ స్పెషలిస్టులుగా తీర్చిదిద్దారు. కేవలం రోగుల సేవే కాకుండా, వైద్య విద్యార్థుల విద్యను, పరిశోధనను ప్రోత్సహించారు. ట్రాన్స్ప్లాంటేషన్‌కు సంబంధిత నైతిక, న్యాయపరమైన విధానాల రూపకల్పన లోనూ ఆయన గణనీయమైన పాత్ర పోషించారు.ఆయన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 1982లో పద్మశ్రీ అవార్డుతో డాక్టర్ రాజ్ వీర్ సింగ్ యాదవ్‌ను సత్కరించింది. మూత్రపిండ మార్పిడి శస్త్ర చికిత్సల రంగంలో భారత దేశంలో ఈ అవార్డు అందుకున్న మొట్టమొదటి వైద్యుడు ఆయనే. అంతేకాకుండా, దేశ అధ్యక్షులు నీలం సంజీవ రెడ్డి, జ్ఞానీ జైల్ సింగ్, ఆర్. వెంకటరామన్‌లకు గౌరవ వైద్యుడిగా సేవలందించారు. ఇది ఆయన వైద్య నైపుణ్యానికి, వ్యక్తిత్వ మహిమాన్వితానికి అద్దం పడే ఘనత.ఆయన సేవా భావాన్ని, దాతృత్వాన్ని మరింత విస్తరించేందుకు "రాజ్ వీర్ సింగ్ యాదవ్ ఫౌండేషన్" స్థాపించ బడింది. ఈ సంస్థ భారతీయ సమాజాల్లో ఆరోగ్య, విద్య, సాధికారత తదితర రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంది.డాక్టర్ యాదవ్ 2016 ఫిబ్రవరి 4న మరణించారు. ఆయన మరణం దేశ వైద్య సమాజానికి తీరని లోటు. కానీ ఆయన వేసిన పునాదులపై వేలాది మంది వైద్యులు నేడు దేశవ్యాప్తంగా మూత్రపిండ మార్పిడి సేవలందిస్తున్నారు. ఆయన చూపించిన మార్గం, నిబద్ధత, మానవతా విలువలు వైద్యసేవలోనూ, సామాజిక రంగాల్లోనూ చిరస్థాయిగా నిలుస్తాయి. వైద్య విజ్ఞానానికి, సేవాభావానికి మహోన్నత ప్రతీకగా నిలిచిన డాక్టర్ రాజ్ వీర్ సింగ్ యాదవ్ గురించి చెప్పినప్పుడు "వైద్యో నారాయణో హరిః" అన్న వాక్యం సహజంగా గుర్తుకు వస్తుంది. ఆయన జీవితానికి, సేవా యాత్రకు అదే యథార్థ కీర్తి.

# అపర భగీరథుడు ఆర్థర్ కాటన్

"నిత్య గోదావరీ స్నాన పుణ్యదోయోమహమతిః, స్మరామ్యాం గ్లేయ దేశీయం కాటనుం తం భగీరథం" ఆంధ్ర ప్రదేశ్ లోని ఉభయ గోదావరి నదీ తీర వాసులు గోదావరీ స్నానాల సమయంలో సంకల్పం చేసేప్పుడు పఠించే సాంప్రదాయం ఆచరిస్తారు. అపర భగీరుథుడైన ఆంగ్లేయ ఇంజినీర్ సర్ ఆర్థర్ కాటన్ కారణంగా తాము నిత్యం ఉదయాన్నే గోదావరి స్నానమా చరించే భాగ్యం కలిగిందన్నది దాని సారాంశం. కేవలం గోదావరి స్నానమాచరించే అవకాశమే కాదు, తమ జీవితాల్లో సమూల మార్పులకు మూలం ఆర్థర్ కాటన్ ఆలోచనే అని గోదావరి తీర వాసులు నేటికీ విశ్వసిస్తారు. అందుకు అనుగుణంగా ఆయనను నిత్యం తమ పూజా మందిరంలో కొలిచేవాళ్లు, తమ ఇంటి వద్ద, సమీపాలలో కాటన్ మహాశయుని విగ్రహాలు ఏర్పాటు చేసుకుని ఆరాధించేవాళ్లు చాలామంది కనిపిస్తారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రగతిలో అనేక అంశాలలో గోదావరి, కృష్ణా తీరం ముందు ఉండడంలో కాటన్ శ్రమ ఉందని భావించక తప్పదు. కాటన్ దొర అని గోదావరి ప్రజలు అభిమానంగా పిలుచుకొనే జనరల్ సర్ ఆర్థర్ కాటన్ (మే 15, 1803 – జూలై 24, 1899) బ్రిటిషు సైనికాధికారి, నీటిపారుదల ఇంజనీరు. కాటన్ తన జీవితాన్ని బ్రిటిషు భారత సామ్రాజ్యములో నీటిపారుదల, నావికాయోగ్యమైన కాలువలు కట్టించడానికి జీవితాన్ని ఫణంగా పెట్టిన మేధావి, కార్యశీలి. కాటన్ 15 ఏళ్ల వయసులో ఈస్ట్ ఇండియా కంపెనీ ఇంజనీరింగు సర్వీసుల్లో చేరి శిక్షణ పొందారు. 1819లో రాయల్ ఇంజనీర్స్ దళంలో సెకండ్ లెఫ్టినెంట్‌గా నియమితుడైన ఆయన విధి నిర్వహణలో భాగంగా 18 ఏళ్ల వయసులో భారత దేశానికి వచ్చి మొదటిసారిగా మద్రాస్‌లో ఉద్యోగిగా పనిచేశారు. అక్కడి నుంచి ఈస్ట్ ఇండియా కంపెనీ తరుఫున దక్షిణ భారత చెరువుల శాఖకు ఇంజనీర్‌గా నియమితులయ్యారు. ఆ సమయంలో 1828–29 మధ్య కాలంలో కావేరీ నది వరద సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేశారు. కరువు పీడిత ప్రాంతం గోదావరి డెల్టాగా రూపాంతరం చెందడంలో ధవళేశ్వరం వద్ద నిర్మించిన ఆనకట్ట ప్రధాన పాత్ర పోషించింది. అప్పటి జిల్లా అధికారిగా ఉన్న సర్ హెన్రి మౌంట్ పంపించిన నివేదిక ఆధారంగా ఆనకట్ట నిర్మాణం ఆలోచన తెరమీదకు వచ్చింది. ఆర్థర్ కాటన్ అనే ఇంజనీరుకు సదరు ప్రతిపాదన అప్పగించి, సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని బ్రిటీష్ ప్రభుత్వం అప్పగించడంతో ఆయన అందుకు అనువైన ప్రాంతం కోసం సుదీర్ఘ అన్వేషణ చేశారు. అలా 1840లోనే కృష్ణా నదిపై ఆనకట్ట నిర్మాణ సాధ్యాసాధ్యాలపై ఆయన రూపొందించి, ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను అప్పటి మద్రాసు గవర్నరు మార్కస్ ట్వేల్ డేల్ ఆమోదించారు. లండన్‌లోని బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఆమోదానికి పంపించారు. ప్రాజెక్టు రిపోర్టును పరిశీలించిన తర్వాత, 1846 ధవళేశ్వరం వద్ద గోదావరిపై ఆనకట్టను కాటన్ ఆధ్వర్యంలో నిర్మించేందుకు లండన్ నుంచి అనుమతి లభించింది. 1847 ఏప్రిల్ నెలలో ఆనకట్ట నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆనకట్ట నిర్మాణంలో పది వేలమంది కూలీలతో పాటుగా ఐదు వందల మంది వడ్రంగులు, ఐదు వందల మంది కమ్మరులను వినియో గించారు. ధవళేశ్వరం వద్ద గోదావరి సుమారుగా 6 కి.మీ. వెడల్పు ఉంటుంది. 1847 అగస్టు మూడో వారంలో రైల్వే వ్యాగన్ల ద్వారా ఉక్కు, రాయిని ధవళేశ్వరానికి తరలించారు. దాంతో యంత్ర సామాగ్రితో నిర్మాణపు పనులు ముమ్మర మయ్యాయి. నది ఒడ్డుకు చేర్చిన రాళ్లు, ఇతర సామగ్రిని పడవల ద్వారా నదిలోని నిర్మాణ ప్రాంతానికి రవాణా చేసేవారు. ఇందుకు 25 టన్నుల భారం మోయగల 18 నావలను వినియోగించారు. కాటన్ కు కూలీలతో పాటుగా ఇంజనీర్లయిన భారతీయులు కూడా కొందరు తోడుగా ఉన్నారు. వారిలో తొలి నాటి ఇంజనీర్లలో ఒకరైన రాజ్ బహుదూర్ వీణం వీరన్న కూడా ఉన్నారు. కాటన్ పర్యవేక్షణలో ఈ ఆనకట్టను వేగంగా పూర్తి చేశారు.

# అణుశక్తిని మానవాళి శ్రేయస్సుకే..

రెండో ప్రపంచ మహా యుద్ధం మానవ చరిత్రలో అత్యంత ఘోరమైన పరిణామాలను మిగిల్చింది. 1945లో జపాన్ దేశంలోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అమెరికా సంయుక్త రాష్ట్రాలు వేసిన అణు బాంబుల ధ్వంసం లక్షలాది మంది అమాయక ప్రజల ప్రాణాలను హరించడమే కాదు, అక్కడి జీవ వ్యవస్థను శాశ్వతంగా ప్రభావితం చేసింది. ఈ ఘోర ఘట్టాల తరువాత అణుశక్తి అనే పదానికి ప్రపంచ వ్యాప్తంగా ఒక భయానక భావం ఏర్పడింది. ఇదే సమయంలో అదే శక్తిని మానవాభివృద్ధికి శాంతియుతంగా వినియోగించ వచ్చని విశ్వాసంతో, 1953 డిసెంబరు 8న అమెరికా అధ్యక్షుడు డ్వైట్ డి ఐజెన్ హవర్ ఐక్యరాజ్య సమితి ప్రధాన సభలో "శాంతి కోసం అణుశక్తి" అనే ప్రసంగం ద్వారా ఒక అభూత పూర్వమైన ఆలోచనను ప్రపంచ దృష్టికి తీసుకొచ్చారు. ఈ ప్రసంగం ప్రభావంతో అనేక దేశాలు అణుశక్తిని నియంత్రితంగా, శ్రేయస్సుకు అనుకూలంగా వినియోగించాలనే సంకల్పాన్ని పొందాయి.దీని ఫలితంగా 1956లో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో 82 దేశాల ప్రతినిధులు సమావేశమై అంతర్జాతీయ స్థాయిలో ఒక అణుశక్తి సంస్థను ఏర్పరచాల్సిన అవసరాన్ని గుర్తించి దాని కోసం చట్టబద్ధంగా ఏర్పాట్లు చేశారు. ఈ చట్టం ప్రకారం 1957 జూలై 29న అనేక దేశాలు అంగీకార పత్రాలపై సంతకాలు చేయగా, అదే తేదీని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ఆవిర్భావ దినంగా గుర్తించారు. ఆగష్టు 1, 1957న ఈ సంస్థ కార్యనిర్వాహకంగా తన విధులను ప్రారంభించింది. ఆస్ట్రియా రాజధాని వియన్నాలో ప్రధాన కార్యాలయం ఉన్న ఈ సంస్థ ప్రస్తుతం 178 దేశాలను సభ్యులుగా కలిగి ఉంది. అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకే పరిమితం చేయాలనే సంకల్పంతో ఈ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా అణుశక్తి వినియోగంపై పర్యవేక్షణ, నియంత్రణ, సహకారం వంటి కర్తవ్యాలను నిర్వర్తిస్తోంది. ఈ సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశ్యం అణుశక్తిని నాశనానికి కాదు, మానవాళి శ్రేయస్సుకు ఉపయుక్తంగా మలచడం. విద్యుత్ ఉత్పత్తి, వ్యాధి నివారణ, వ్యవసాయ పరిశోధన, నీటి శుద్ధి వంటి అనేక రంగాలలో అణుశక్తిని వినియోగించేందుకు మార్గదర్శకత్వం కల్పించడం సంస్థ ధ్యేయంగా ఉంది. ఈ లక్ష్యాల సాధనకు ప్రపంచం లోని అణుశక్తి కేంద్రాలపై తనిఖీలు నిర్వహించడం, భద్రతా ప్రమాణాలను రూపొందించడం, సాంకేతిక సహకారాన్ని అందించడం, శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అణు పదార్థాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు, ఆయుధాల తయారీని నిరోధించేందుకు సంస్థ నిరంతరంగా చర్యలు తీసుకుంటోంది.ఈ సంస్థ అణుశక్తిని శాంతికోసం వినియోగించే దిశగా చేసిన విశేష కృషికి గుర్తింపుగా 2005లో నోబెల్ శాంతి బహుమతి లభించింది. ఇది ఈ సంస్థతోపాటు అప్పటి ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఎల్ బరదైకి కూడా వరించింది. అణుశక్తి వ్యాప్తిని నిరోధించడంలో, శాంతియుత అవసరాలకు దాన్ని వినియోగించడంలో, ప్రపంచ దేశాల మధ్య నమ్మకాన్ని పెంపొందించడంలో చేసిన కృషికి ఇది ప్రశంసాపాత్రమైన గుర్తింపు. భారత దేశం ఈ సంస్థలో 1957 నుంచే సభ్య దేశంగా కొనసాగుతోంది. భారత దేశానికి అణుశక్తి రంగంలో విశేష అనుభవం, స్వావలంబన ఉన్నప్పటికీ, అణుశక్తి వ్యాప్తిని నిరోధించే ఒప్పందంపై అభ్యంతరాలు ఉన్నందున దాని పక్కన నిలిచి, ఐఎఇఏతో సాంకేతిక, శాస్త్రీయ పరంగా సహకార బంధం కొనసాగిస్తూ ఉంది. 2008లో భారత దేశం అమెరికాతో శాంతియుత అణుశక్తి ఒప్పందం చేసుకున్న సందర్భంగా, ఐఎఇఏతో ప్రత్యేక పర్యవేక్షణ ఒప్పందానికి అంగీకరించింది. దీని ప్రకారం భారత దేశంలోని కొన్ని అణుశక్తి కేంద్రాలు ఈ సంస్థ పర్యవేక్షణకు లోబడి ఉన్నాయి.భారత దేశంలో ప్రస్తుతం 22 అణు విద్యుత్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో కొన్ని కేంద్రాలు అంతర్జాతీయ పర్యవేక్షణలో ఉన్నాయి. భారత అణుశక్తి శాఖ, భాభా అణు పరిశోధన సంస్థ, అణు విద్యుత్ సంస్థ, అంతరిక్ష పరిశోధన సంస్థ తదితర శాస్త్రీయ సంస్థలు ఐఎఇఏ సహకారంతో అనేక అంతర్జాతీయ పరిశోధన కార్యక్రమాలలో పాలుపంచు కుంటున్నాయి. వ్యవసాయ రంగంలో విత్తనాల అభివృద్ధి, కీటక నాశక పరిశోధనలు, నీటి పరిశుద్ధత విశ్లేషణ, వ్యాధి నిర్ధారణ పరికరాలు, క్యాన్సర్ చికిత్సల్లో న్యూక్లియర్ వైద్యం వంటివి ఈ సంస్థ సహకారంతో భారత దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలుగా నిలిచాయి. ప్రపంచ వ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తిలో దాదాపు పదిశాతం వరకు అణుశక్తిపై ఆధార పడుతున్నది. శుద్ధమైన, కాలుష్య రహిత శక్తి మూలంగా అణు శక్తికి ప్రాధాన్యం పెరుగుతున్నది. కానీ, అణు ప్రమాదాల భద్రతపై పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఐఎఇఏ భద్రతా ప్రమాణాలను మరింత కఠినతరం చేసింది. ఉక్రెయిన్‌లోని జాపొరిజ్యా అణుశక్తి కేంద్రంపై యుద్ధ భయాలు నెలకొన్న సందర్భంలో ఐఎఇఏ నేరుగా తన పరిశీలకులను పంపించి భద్రతా నివేదికలు అందజేయడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో నమ్మకాన్ని ఏర్పరిచింది. ఇరాన్ అణుశక్తి ఒప్పందం, ఉత్తర కొరియా అణు పరీక్షలపై పర్యవేక్షణ వంటి వ్యవహారాలలో కూడా సంస్థ తన పాత్రను బలంగా నిలబెట్టుకుంది. 1957 జూలై 29న స్థాపితమైన అంతర్జాతీయ అణుశక్తి సంస్థ నేడు శాంతికోసం శాస్త్రీయంగా, నియంత్రితంగా అణుశక్తిని వినియోగించే దిశగా విశ్వ వ్యాప్తంగా మార్గనిర్దేశకంగా నిలుస్తోంది. శాంతియుత ప్రయోజనాలకు అణుశక్తిని వినియోగించాలన్న సంకల్పాన్ని నెరవేర్చే దిశగా వ్యవహరించిన ఈ సంస్థ అణుశక్తికి కొత్త నిర్వచనాన్ని ఇచ్చింది. నాశనానికి మార్గమైంది అన్న నెగిటివ్ అభిప్రాయాన్ని తొలగించి, శాంతి కోసం వినియోగించే శక్తిగా అణుశక్తిని మలచ గలమని ప్రపంచానికి చాటి చెప్పింది. శాస్త్రీయ విజ్ఞానాన్ని మానవ సంక్షేమానికి ఉపయోగించే దిశగా ఐఎఇఏ చేస్తున్న కృషి అభినందనీయం. భవిష్యత్ తరం అవసరాల కోసం భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, జాగ్రత్తగా అణుశక్తిని వినియోగించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తూ ఐఎఇఏ మానవాళికి సుస్థిర అభివృద్ధి దిశగా వెలుగు చూపుతున్నది.

# న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్

**నల్గొండ జూలై 26 ప్రభాత సూర్య** నల్లగొండ న్యావాదుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ లీగల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ అన్నారు. శనివారం నల్గొండలోని రెవెన్యూ అతిథి గృహంలో కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నాంపల్లి నరసింహ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా పదవులు పొందిన న్యాయవాదులు పార్టీ కార్యకర్తలకు తప్పనిసరిగా న్యాయ సహాయం అందించాలని కోరారు. పదవి పూర్తయిన తర్వాత పార్టీని విస్మరించడం సరైన విధానం కాదన్నారు. అదేవిధంగా పార్టీలో పని చేసిన న్యాయవాదులకే పార్టీ పరంగా వచ్చే పదవులలో అవకాశం కల్పించాలని అన్నారు. త్వరలో జరగబోయే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో అడ్వకేట్ ప్రొటెక్షన్, వెల్ఫేర్ బిల్లు పాస్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది న్యాయవాదులంతా హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో సంవత్సరాల నుంచి న్యాయవాదులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ అధికారంలో రావడంలో న్యాయవాదుల పాత్ర కూడా ఎంతో ఉందని తెలిపారు. న్యాయవాద వృత్తిలో ఎన్నో కష్టనష్టాలు ఉన్నాయని, వారి సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంత పరంగా చేస్తున్న కార్యక్రమాలన్నింటికీ న్యాయవాదులంతా మద్దతుగా ఉన్నారని తెలిపారు. న్యాయ వాదుల రక్షణకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి మాట్లాడుతూ కష్టపడ్డ కార్యకర్తలకు ప్రభుత్వ పదవులు రావాలని సూచించారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జెడ్పిటిసి వంగూరు లక్ష్మయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్టా



అనంతరెడ్డి,పట్టణ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు, న్యాయవాది నాంపల్లి భాగ్య, ఏజీపీలు శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, వీరయ్య, న్యాయవాదులు నామిరెడ్డి మోహన్ రెడ్డి, మెమీన్ రోషన్ జమీర్, ఉమా శంకర్, మేడ మోహన్ రెడ్డి, నఫీస్ ఫాతిమా, చక్రవర్తి ,పాశం నరేష్ రెడ్డి, మామిడి శ్రీను, వెంకటేశ్వర్ రెడ్డి ,ఈ.దేవా, బిక్షపతి గౌడ్, రాజకుమార్, పొన్నం రవీందర్ ,రత్నారెడ్డి, లుక్మాన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## పరమవీరచక్ర కల్నల్ సంతోష్ కుమార్ విగ్రహం ఆవిష్కరణ.

ఘనంగా నివాళులు.



**నల్గొండ జిల్లా 26 ప్రభాత సూర్య** భారత్ భూభాగాన్ని కాపాడడం కోసం చైనా సైనికులతో సరిహద్దులో వీరోచిత పోరాటం చేసి 2020 జూన్ 15వ తేదీన గాల్వాన్ లోయలో అసువులు బాసిన కర్నల్ పరమవీరచక్ర సంతోష్ కుమార్ విగ్రహాన్ని కార్గిల్ దివాస్ దినోత్సవం సందర్భంగా స్థానికంగా ఉన్న ఆర్య సమాజంలోని జై జవాన్ సైనిక శిక్షణ కేంద్రంలో దాత ఈగ దయాకర్ గుప్త అందజేసిన సంతోష్ కుమార్ విగ్రహాన్ని అమరవీరుడు సంతోష్ కుమార్ తల్లిదండ్రులు బికమల ఉపేందర్ మంజులలు విగ్రహాన్ని ఆవిష్కరించారు. సందర్భంగా అమరవీరుడు సంతోష్ కుమార్ కు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పరమవీరచక్ర కల్నల్ సంతోష్ కుమార్ తండ్రి ఉపేందర్ మాట్లాడుతూ తన కుమారుడు దేశ సేవలో అమరుడు అవడం దేశ మొత్తం తన కుమారుని గౌరవించి కీర్తించడం గర్వకారణంగా ఉందన్నారు. తన కుమారుని వలేనేటి యువత సైన్యంలో చేరి దేశ రక్షణకు పాటుపడాలన్నారు. గాల్వాన్న కార్గిల్లో పల్గాంలలో ఎంతోమంది సైనికులు దేశం కోసం పోరాడి వీర మరణం చెందారని వారందరికీ నివాళులర్పిస్తున్నటిలు లుతెలిపారు కార్యక్రమంలో లయన్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొని సంతోష్ కుమార్ కు ఘన నివాళులర్పించి ఆయన తల్లిదండ్రులను సన్మానించారు కార్యక్రమంలో కూరెల్లి శ్రీనివాసచారి సైనిక శిక్షణ పొందుతున్న యువతీ యువకులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

-సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని కి వినతిపత్రం అందించిన బత్తుల సోమయ్య



**ఖమ్మం( సూర్య ప్రతినిధి )**తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అసెంబ్లీలో మా తరఫున వాణి వినిపించాలని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు తెలంగాణ ఉద్యమకారులు జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య వినతిపత్రం అందించారు. తెలంగాణ ఉద్యమకారులకి అమరవీరుల కుటుంబాల భద్రత కోసం ఉద్యమకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు 250 గజాల స్థలం ఇంటి నిర్మాణం కోసం 30 లక్షలు అమరవీరుల కుటుంబాలకు 25 వేల రూపాయలు పెన్షన్ వీటితోపాటు హెల్త్ కార్డు రవాణా సౌకర్యం కోసం రవాణా పాసులు ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో విన్నవించారు.అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుడైన కూనంనేని సాంబశివరావు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పాదయాత్ర చేసిన వ్యక్తి కాబట్టి ఉద్యమకారుల బాధలు సాధకాలు తెలిసినని అసెంబ్లీలో మా తరఫున మా ఆవేదన వెలిబుచ్చాలని కోరారు. ఈ యొక్క కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల జిల్లా అధ్యక్షుడు అంబాల రామారావు ప్రధాన కార్యదర్శి అంగిడి బిక్షం తునికి పార్టీ చారి కుర్రి ముత్తయ్య కూరపాటి కృష్ణమూర్తి కుక్క సత్యం వడిత్య రాజేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

# పాఠశాలల్లోని విద్యార్థులకు వైద్య పరీక్షలు



జిల్లా కలెక్టర్,జిల్లా వైద్య శాఖ అధికారి ఆదేశాలతో విద్యార్థులకు వైద్య పరీక్షలు

చౌటుప్పల్ మండల వైద్యాధికారి చింతకింది కాటంరాజు

**చౌటుప్పల్.జులై 26. ప్రభాత సూర్య:**దవిద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని చౌటుప్పల్ మండల వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ కాటంరాజు సూచించారు. శనివారం యాదాద్రి జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశానుసారం ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రారంభమవుతున్న కారణంగా ముందస్తు చర్యల్లో భాగంగా చౌటుప్పల్ మండల కేంద్ర పరిధిలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల, బాలుర పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు , కేజీబీవీ పాఠశాల, ఆదర్శ పాఠశాల, రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలు, మైనార్టీ గురుకుల



పాఠశాల,నేలపట్లలోని బాలుర వసతి గృహం,పలు ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య శిబిరంలు నిర్వహించినట్లు మండల వైద్యాధికారి చింతకింది కాటంరాజు తెలిపారు. వైద్య శిబిరంలో పాల్గొన్న విద్యార్థుల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులను అందజేశారు.సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయా పాఠశాలల సిబ్బందికి, విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ చింతకింది కాటంరాజు, డాక్టర్ సంపత్, డాక్టర్ నరేష్, డాక్టర్ జయంత్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ సౌజన్య, ప్రణీత, పారిజాత, జ్యోతి,రజిత,మెడికల్ ఆఫీసర్ అనిత,హెల్త్ సూపర్వైజర్స్ మనోహర్, సత్యనారాయణ, శశికళ, ఝాన్సీ, స్టాఫ్ నర్స్ ఖలీల్, ఫార్మసిస్ట్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు సునీత, పద్మ, ప్రవీణ్ రెడ్డి,ఆశలు పాల్గొన్నారు.

# మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

-మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రాం రెడ్డి

**చౌటుప్పల్.జులై 26. ప్రభాత సూర్య:** పర్యావరణ సమతుల్యత కాపాడేందుకు మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, పచ్చదనంతో పాటు పరిశుభ్రత పాటించాలని చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రాంరెడ్డి అన్నారు.100 రోజుల కార్యక్రమంలో భాగంగా 55వ రోజున వనమహోత్సవ కార్యక్రమంను చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని 2,వ వార్డు తాళ్ళసింగారం గ్రామం ముత్యాలమ్మ గుడి దగ్గర వన మహోత్సవ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి వెంకటరామిరెడ్డి పాల్గొని ఆశ్రమంకు వెళ్ళే మార్గంలో ఒక కిలోమీటరు మేర మొక్కలు నాటాల్సిందిగా ఆదేశించారు. వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు.మొక్కలు పెరిగి పెద్దగా కావడానికి గ్రామంలోని ప్రజలందరూ సహకరించాలని కోరారు. మొక్కలు పెంచడంతోటి ఆరోగ్యకరమైన ఆక్సిజన్ ని పొందవచ్చున్నారు. అనంతరం కాలనీ వాసులతో పాటు మున్సిపల్ కార్మికులతో మొక్కలు ఆయన నాటించారు. పాఠశాలలోని విద్యార్థులు కూడా మొక్కలు నాటి కాపాడాలని



తెలిపారు. వార్డు ప్రజలకు మొక్కలని అందజేసి వాటిని పూర్తిస్థాయిలో సంరక్షించి పెంచే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంజయ్య, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్ , బత్తుల ఆంజనేయులు, దొనకొండ కృష్ణ దొనకొండ నరసింహ , ఎస్సై హనుమాన్ ప్రసాద్,ఈ ఈ రేణు కుమార్, వార్డు సలీం,బీసీ వెంకటేశ్ , జవాన్ అంజయ్య, టీ డబ్ల్యూ ఐ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఆర్ నగర్ కాలనీలో ఘనంగా కాటమయ్య బోనాలు



**తుర్కయంజాల్,జులై 26, ప్రభాత సూర్య:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి మన్నెగూడ ఎన్ఎస్ఆర్ నగర్ కాలనీలో కాటమయ్య బోనాలు అంగరంగ వైభవంగా గౌడ సంఘం పెద్దలు నిర్వహించారు. శనివారం ఉదయం కాటమయ్య స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం, అమ్మవారికి సారె కార్యక్రమం జరిగింది. అనంతరం కాటమయ్యకు మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపు కొనసాగింది. ఈ సందర్భంగా కుల పెద్దలు మాట్లాడుతూ గౌడన్నల కులదైవం కంఠమహేశ్వరస్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయరారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, పాడిపంటలతో, సుభిక్షంగా విలసిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాటమయ్య గుడి అధ్యక్షుడు కేశమోని రాజుగౌడ్, గౌడ సంఘం పెద్దలు పొట్ల జంగయ్య గౌడ్, వట్నాల ధనుంజయగౌడ్, ఎడ్ల నారాయణ గౌడ్, కాట్ల శ్రీనివాస్ గౌడ్, మట్ట మల్లేష్ గౌడ్, గునుగంటి జంగయ్య గౌడ్, పల్లె కుమార్ గౌడ్, సీఎం జంగయ్య గౌడ్, పొట్ల సాయిలు గౌడ్, వెంకటేశ్ గౌడ్, ముచ్చర్ల మల్లేష్ గౌడ్, మట్ట రమేష్ గౌడ్, జినుగుంట్ల శ్రీరాములు, జినుగుంట్ల భుజంగం గౌడ్, చారగొండ సత్తయ్య గౌడ్, కేశగోని అంజయ్య గౌడ్, కేశగోని కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ మహాసభను జయప్రదం చేయాలి

-జిల్లాకార్యవర్గసభ్యులు బచ్చనగోని గాలయ్య




**-చౌటుప్పల్.జులై 26. ప్రభాత సూర్య:** ఈ నెల 29న వలిగొండ లో నిర్వహించే సీపీఐ యాదాద్రి భువనగిరి జిల్లా 4వ మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య అన్నారు. శనివారం చౌటుప్పల్ మండల కేంద్రంలో సిపిఐ నాయకులు మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో ఉన్న ప్రజాసమస్యలు పరిష్కారం కోసం సీపీఐ అనేక ప్రజా పోరాటాలు నిర్వహిస్తుందని, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వాలు కృషిచేయాలనీ అన్నారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టు లని పూర్తిచేయాలనీ, అర్హులైన ప్రజలందరికి ప్రభుత్వ పతకాలు అందేలా చేయాలన్నారు. పైరవీలు లేని పాలనను అందించాలని కోరారు. జిల్లా సమగ్రభివృద్ధి కోసం,ప్రజా పోరాటాల రూపకల్పనకు జిల్లా మహాసభ లో సుదీర్గంగా చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని,ఈ మహాసభ కు జిల్లాలోని అన్ని మండలాల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి, మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి,పిల్లి శంకర్, ఉడుత రామలింగం, ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరు వెంకటేష్, రొండి నర్సింహ్,బద్దుల సుధాకర్,దాసరి అంజయ్య,రోషణగారి అంజయ్య,నీళ్ల బిక్షపతి, కుంటి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



**వలిగొండ, జూలై 26( ప్రభాత సూర్య)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఆరూరు గ్రామంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్, పిట్టల యాదమ్మ, 40 వేల రూపాయలు,మన్యం శంకరయ్య 12 వేల రూపాయలు చెక్కులు వారికి అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు బండారు నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ జినుకల దానయ్య, వలిగొండ ఓబిసి సెల్ మండల అధ్యక్షుడు చిలకమర్రి కనకాచారి, సింగిల్ విండో డైరెక్టర్ రావుల స్వామి, మత్స్యగిరి గుట్ట ధర్మకర్త బండి రవికుమార్, ఆరూరు మత్స్య కార్మిక సంఘం అధ్యక్షులు నిమ్మల రవికుమార్ కాంగ్రెస్ నాయకులు, ఆవుల సత్యనారాయణ, ,ఆవుల అంజయ్య, ఓరుగంటి రామచంద్రం, మర్రినాగరాజు, నిమ్మల రవి, జినుకల చిన్న నరసింహ, తదితరులు పాల్గొన్నారు,

## మండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి ని కలిసిన పి ఆర్ టి యూనియన్ నేతలు



**నల్గొండ జులై 26 ప్రభాత సూర్య** తెలంగాణ శాసన మండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డినీ శనివారం నల్గొండ క్యాంప్ కార్యాలయంలో పి ఆర్ టి యు యూనియన్ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు . నూతనంగా అధ్యకునిగా ఎన్నికైన కాలం నారాయణ రెడ్డి గుత్తా సుఖేందర్ రెడ్డి కి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన నూతనంగా ఎన్నికైనా ప్రెసిడెంట్ , తదితరులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని , బావిభారత పౌరులుగా విద్యార్థులను తయారు చేయాలని గుత్తా సుఖేందర్ రెడ్డి వారికి సూచించారు.

## దివంగత నేత మాగంటి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**కూకట్ పల్లి, జులై 26 (ప్రభాత సూర్య) :** కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని శేషాద్రి నగర్ లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శనివారం ఎర్రగడ్డ డివిజన్ కు చెందిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే దివంగత మాగంటి గోపీనాథ్ మరణంతో ఆ నియోజకవర్గంలో రాబోయే రోజుల్లో జరిగే ఉప ఎన్నికల్లో ఎర్రగడ్డ డివిజన్ నుంచి భారీ మెజారిటీ బి ఆర్ ఎస్ పార్టీ తెరపున ఇచ్చే విధంగా కృషి చేయాలని, అలాగే ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సారథ్యంలో జరిగిన అభివృద్ధిని ఇంటింటికి వివరించి ప్రజలకు తెలిసేలా చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి చేసిందేమీ లేదని ఆనాడు కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలే తప్ప ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని దీన్ని ప్రజలకు వివరించే బాధ్యత నాయకులు, కార్యకర్తలు తీసుకుని ముందుకు వెళ్లాలని దిశా నిర్దేశం చేశారు.

# అసెంబ్లీ ఎన్నికల ముందు నాతో సహా నా అసిస్టెంట్ నెంబర్ మా పార్టీ నాయకుల నెంబర్లు సైతం ట్యాపింగ్ చేసిన బిఆర్ఎస్ ప్రభుత్వం

ఉదయం రెండు గంటలు తప్ప ప్రజలకు అందుబాటులో ఉండని కూకట్ పల్లి ఎమ్మెల్యే ఇప్పటికీ అధికారులను బెదిరించి నెపం వాళ్ల మీద వేయాలని చూస్తాడు
ఎన్నికల ముందు 90అభివృద్ధి చేశాను అని చెప్పిన ఎమ్మెల్యే ఇప్పుడు పనులే కావటం లేదంటూ డ్రామాలాడుతున్నాడు
హౌసింగ్ బోర్డును ఏర్పాటు చేసిందే కాంగ్రెస్ ప్రభుత్వంఆ భూముల పరిరక్షణకు ప్రస్తుత ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టింది.
పేద ప్రజల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది
ఎమ్మెల్యే కనుసన్నల్లోనే చెరువులు, కుంటలు ఆక్రమించి అమ్ముకొని ఆయన అనుచరులు సొమ్ము చేసుకున్నారు.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలలోనే నియోజకవర్గ అభివృద్ధికి పది కోట్ల రూపాయలు మంజూరు చేసింది
టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్




**కూకట్ పల్లి, జులై 26 (ప్రభాత సూర్య) :**కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ పెద ప్రజల సంక్షేమ అభివృద్ధి కోసమే పనిచేస్తుందని టిపిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యే అని చెప్పుకునే కృష్ణారావు రోజుకు రెండు గంటలకు మించి ప్రజలకు అందుబాటులో ఉండడని పేరుపొందిన ఎమ్మెల్యే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆయాంలో అభివృద్ధి అమ్ముకుంటున్నారని కృష్ణారావు చేసిన వ్యాఖ్యలపై బండి రమేష్ శనివారం మూసాపేట్ లోని హేమ దుర్గాభవాని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారంజక పాలన చేస్తోందని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలతో పాటు మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతో%శీ%దన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం ద్వారా 200 కోట్ల మంది మహిళామణులు ప్రయాణం చేశారన్నారు. రూ 500 కే గ్యాస్, 25 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, మహిళా సాధికారత దిశగా ఎన్నో కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందన్నారు. వరి వేస్తే ఒరేయ్ అన్న నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు తీరని ద్రోహం చేసిందన్నారు. రైతు క్షేమంగా ఉంటే దేశం సుభిక్షంగా ఉంటుందంటూ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.23 వేల కోట్ల రుణమాఫీ చేసిందని, రైతు భరోసా కింద రూ.9,000 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయం అందించింది అన్నారు. ఇక కుకట్ పల్లి నియోజకవర్గం విషయానికి వస్తే ఎమ్మెల్యే కృష్ణారావు సాంకేతికంగా గెలిచినా నైతికంగా ఓడిపోయాడని, అతని గెలుపును తాను అంగీకరించడం లేదని రమేష్ పేర్కొన్నారు. కృష్ణారావు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరగడం లేదంటూ నానాయాగి చేసే కృష్ణారావు ఎమ్మెల్యేగా గత 11 ఏళ్లుగా నియోజకవర్గానికి ఏం చేశాడంటూ రమేష్ ప్రశ్నించారు. ప్రత్యర్థి వర్గాల ఫోన్లు ట్యాప్ చేయించడం, అధికారులను బెదిరించడం, ప్రశ్నించిన వారి మీద కేసులు పెట్టడం, బెదిరించడం తప్ప అతను నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదని రమేష్ ధ్వజమెత్తారు. ఫోన్ ట్యాప్ అయిన వారి పేర్లను ఆయన మీడియాకు వెల్లడించారు. రోజుకు రెండు గంటలు మించి ప్రజలకు అందుబాటులో ఉండని ఎమ్మెల్యే ప్రభుత్వంపై తరచూ పనికిరాని, పసలేని విమర్శలు చేయడం ఆయన దిగజారుడు ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం అని, హౌసింగ్ బోర్డ్ స్థలాలను కాపాడేందుకు ప్రభుత్వం పలు రక్షణ చర్యలు తీసుకుంటుంది అన్నారు. బిఆర్ఎస్ హయంలోనే హౌసింగ్ బోర్డ్ స్థలాలను, ప్రభుత్వ స్థలాలను, చెరువులు, కుంటలు ఆక్రమించి నాయకులు, కార్యకర్తలు దోచుకుతిన్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రోడ్లు కబ్జా చేసి డబ్బాలు వేయించి వారి నుంచి డబ్బులు వసూలు చేసేది నీ అనుచరులే అని విమర్శించారు. చెరువుల సుందరీకరణ పేరుతో బిఆర్ఎస్ నాయకులు దోచుకోవడానికి దారి చూపారన్నారు. నియోజకవర్గంలోని చెరువులు కబ్జా అయితే వాటిని రక్షించేందుకు హైడ్రా తీసుకువస్తే దానిమీద విష%శీ% చిమ్ముతున్నారని పేర్కొన్నారు. డబల్ బెడ్రూంలో కోసం 31 వేలు అప్లికేషన్లు వస్తే 900 మందికి మాత్రమే ఇచ్చారని కైతలాపూర్ లో నిర్మించిన ఇళ్లు ఇప్పటికీ లబ్ధిదారులకు ఇవ్వకుండా అలాగే ఉన్నాయన్నారు. గత 15 ఏళ్లలో పేదలకు ఒక్క రేషన్ కార్డు సైతం ఇవ్వలేదని తమ ప్రభుత్వం 28,000 మందికి త్వరలో రేషన్ కార్డు ఇవ్వడం ఉన్నట్లు ప్రకటించారు. దేశంలోనే మొట్టమొదటిగా రేవంత్ రెడ్డి ఆయంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన నెలలోనే నియోజకవర్గ అభివృద్ధికి రూ. 10 కోట్లు కేటాయించడంతోపాటు మరెన్నో నిధులను మున్సిపాలిటీకి జిహెచ్ఎంసికి ఇవ్వడం జరిగిందన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం లో అభివృద్ధి ఏం జరగలేదని హౌసింగ్ బోర్డ్ లో ఇంకా ఎల్ఐజీ ఇళ్లు రిజిస్టర్ కాలేదని ట్రాఫిక్ సమస్య అలాగే ఉందని, అయితే అభివృద్ధి 90% పూర్తి అయిందని 26 కులాలను బీసీల్లో కలుపుతామని ఎన్నికల ముందు పెద్ద డ్రామా ఆడాడనీ రమేష్ విమర్శించారు. మూసాపేట వై జంక్షన్, జేఎన్టీయూ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కూకట్ పల్లి లో పీజీ కాలేజీ ఏర్పాటుకు, హౌసింగ్ బోర్డ్ లో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి, ఎస్సీ వర్గీకరణకు, బీసీలకు 42% రిజర్వేషన్లకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. సమావేశంలో ఏ, బి బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, తూము వేణు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఖైతపురం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం



ఏపీకి చెందిన ఇద్దరు డీఎస్పీలు అక్కడిక్కడే మృతి..
మరో అడిషనల్ ఎస్పీకి, కార్ డ్రైవర్ కు తీవ్ర గాయాలు...





**చౌటుప్పల్.జులై 26. ప్రభాత సూర్య:** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం, కైతపురం గ్రామ స్టేజి వద్ద విజయవాడ- హైదరాబాద్ వైపు వెళ్లే జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఇద్దరు డీఎస్పీ లు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. వీరితో పాటు కారులో ప్రయాణిస్తున్న మరో అడిషనల్ ఎస్పీ కోక దుర్గా మల్లేశ్వర వెంకట రాం ప్రసాద్(58), కారు డ్రైవర్, హెడ్ కానిస్టేబుల్ రెడ్డి చర్ల నరసింహారాజు(54) తీవ్ర గాయాల పాలైనారు . చౌటుపల్ సీఐ మన్మధ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ కు చెందిన పోలీస్ అధికారులు ఈనెల 25 శుక్రవారం రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో ఏపీ 18పి1176 నెంబర్ గల స్కార్పియో వాహనంలో హైదరాబాద్ కు బయలుదేరి వస్తుండగా చౌటుప్పల్ మండలం కైతపురం గ్రామ స్టేజి సమీపంలోకి వచ్చేసరికి స్కార్పియో వాహనానికి బ్రేక్ వేయడంతో స్కార్పియో వాహన నడుపుతున్న డ్రైవర్ దానిని తప్పించబోయి జాతీయ రహదారిపై అదుపుతప్పి డివైడర్ ను దాటుకొని జాతీయ రహదారికి మరోవైపు హైదరాబాదు వైపు నుండి విజయవాడ వైపు వెళ్తున్న టీఎస్ 03 యుడి 6039 నెంబర్ గల లారీని ఢీ కొట్టగా ఈ ప్రమాదంలో కారులో ఉన్న డీఎస్పీ లు మాకా చక్రధరరావు(52), జల్లు శాంతారావు(56)లను ఇద్దరికీ తలలకు బలమైన గాయాలు, శరీరంలో ఇతర చోట్ల కనబడిన గాయాలపాలై అక్కడికక్కడే ప్రమాద స్థలంలో ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. కారులోనే ప్రయాణిస్తున్న అడిషనల్ ఎస్పీ దుర్గా మల్లేశ్వర వెంకట రాంప్రసాద్ కు, హెడ్ కానిస్టేబుల్ అండ్ డ్రైవర్ రెడ్డిచర్ల నరసింహారాజులకు తీవ్ర గాయాలు కాగా పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం హుటాహుటిన చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వచ్చి అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ లోని కామినేని ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే ఎసిపి పి మధుసూదన్ రెడ్డి, సిఐ మన్మధకుమార్, ట్రాఫిక్ సిఐ విజయమోహన్, ఎస్సైలు ప్రమాద స్థలానికి చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు.మృతి చెందిన డీఎస్పీలు ఇద్దరు ఇంటలిజెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్ లో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఒక కేసు విషయంలో విజయవాడ నుండి హైదరాబాద్ కు డ్యూటీ నిమిత్తం వెళుతుండగా మార్గమధ్యంలో శనివారం ఉదయం ఈ దుర్ఘటన జరిగినట్లు తెలిపారు. రాచకొండ సి పి సుధీర్ బాబు, భువనగిరి డిసిపి లు చౌటుప్పల్ ఎసిపి మధుసూదన్ రెడ్డి,పోలీస్ అధికార బృందంతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. జరిగిన ప్రమాదంపై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మధ కుమార్ తెలిపారు.

# ఫ్యూచర్ శంషాబాద్

**హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా విమానాశ్రయాల సమిప ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ బూమ్ కొనసాగుతోంది. ముఖ్యంగా హైదరాబాద్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని చుట్టుముట్టిన గ్రామాలు, పట్టణాల్లో భూముల ధరలు ఆశ్చర్యకరమైన రీతిలో పెరిగినట్లు తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. కరోనా తర్వాతి కాలంలో ? అంటే 2021 నుంచి 2025 మధ్య ? ఈ పెరుగుదల మరింత వేగంగా నమోదైందని నివేదికలు చెబుతున్నాయి. విమానాశ్రయానికి 50 కిలోమీటర్ల పరిధిలో డిమాండ్ కొనసాగుతోందని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు.విమానాశ్రయం అభివృద్ధికి ముందు, శంషాబాద్ పరిధిలో భూముల రేట్లు చాలా తక్కువగా ఉండేవి. 1990ల చివరలో చదరపు గజం ధర రూ.500లోపే ఉండేదని అప్పటి రియల్ ఎస్టేట్ డీలర్లు చెబుతున్నారు. కానీ ఇప్పుడీ ప్రాంతం పూర్తిగా మారు రూపం దాల్చింది. శంషాబాద్, బుద్వేల్, సాతంరాయి, మామిడిపల్లి, తుక్కుగూడ వంటి ప్రాంతాల్లో గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లు, విల్లా ప్రాజెక్టులు భారీగా నిర్మాణంలో ఉన్నాయి. ఇవన్నీ విమానాశ్రయానికి 25-50 కిలోమీటర్ల పరిధిలో ఉన్నాయిరియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ స్క్వేర్యార్డ్స్ ప్రకారం, గత ఐదేళ్లలో విమానాశ్రయం సమీప భూగర్భాలు సగటున 74 శాతం ధరల పెరుగుదలను చవిచూశాయి. అపార్ట్‌మెంట్ల ధరలు చదరపు అడుగుకు రూ.6,000 నుంచి రూ.8,000 మధ్యగా ఉండగా, ఇతర ప్రముఖ ప్రాంతాల్లో అదే చదరపు అడుగు ధర రూ.9,000 నుంచి రూ.11,000 వరకు ఉంది. స్థలాల విషయంలో చూస్తే, విమానాశ్రయం సమీపంలో చదరపు గజం ధరలు రూ.55,000 నుంచి రూ.60,000 మధ్య ఉన్నాయి. అదే సమయంలో ఇతర నగర ప్రాంతాల్లో ఇవే రేట్లు రూ.75,000 నుంచి రూ.80,000 వరకు వెళుతున్నాయి.వాస్తవానికి ఇప్పటివరకు శంషాబాద్ చుట్టుపక్కల అభివృద్ధి ఆశించిన స్థాయికి చేరలేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జీవో 111 పరిమితులు, పరిశ్రమలు లేకపోవడం వంటి కారణాలు ప్రధానమైనవని వారు చెబుతున్నారు. అయినప్పటికీ, గత నాలుగైదేళ్లుగా దక్షిణ హైదరాబాద్ వైపు అభివృద్ధి బాగా ఊపందుకుంది. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో ఎకరం స్థలానికి రూ.4 కోట్లు పలుకుతుండగా, ఇంకా కొన్ని ప్రాంతాల్లో చదరపు గజం రూ.5,000 నుంచి రూ.10,000 మధ్యలో దొరికే అవకాశముంది. విల్లాల ధరలు రూ.కోటికి పైగానే ఉంటున్నాయి.ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ముఖ్యంగా శంషాబాద్, తుక్కుగూడ, మహేశ్వరం ప్రాంతాల్లో మౌలిక వసతుల విస్తరణకు ప్రణాళికలు రూపొందించబడుతున్నాయి. నాగోల్ నుంచి ఆరంఘర్ మీదుగా విమానాశ్రయం వరకు మెట్రో రైలు విస్తరణ (లైన్ 2ఏ) ప్రతిపాదించబడింది. రాజేంద్రనగర్‌లో కొత్త హైకోర్టు భవనం నిర్మాణం జరుగుతోంది. శ్రీశైలం-నాగార్జునసాగర్ రహదారుల మధ్యలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరగనుంది, ఇది విమానాశ్రయానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడి నుంచి ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో విస్తరణ యోచనలో ఉంది. మహేశ్వరం పారిశ్రామిక హబ్‌గా మారుతోంది. ఇటీవల ఓ జ్యువెలరీ తయారీ యూనిట్‌కు సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం కూడా జరిగింది.పలు బడా నిర్మాణ సంస్థలు రిటైర్మెంట్ హోమ్స్, టౌన్షిప్‌లు నిర్మించేందుకు భూముల సేకరణ చేపట్టాయి. ఇప్పటికే పలు విద్యాసంస్థలు, ఆధ్యాత్మిక కేంద్రాలు ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతున్నాయి. ప్రాంతీయ వలయ రహదారి పూర్తయ్యే దశలో ఉండటంతో, శంషాబాద్ పరిధి రాబోయే కాలంలో భారీగా అభివృద్ధి చెందే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బాలానగర్ సీఐ నర్సింహా రాజు



**బాలానగర్, జులై 26 (ప్రభాత సూర్య) :** రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని బాలానగర్ సీఐ నర్సింహా రాజు సూచించారు. ఇంకా 48 గంటలు వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపినట్లు అయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడైనా వరదలు సంభవించినప్పుడు ప్రజలకు సహాయ, సహకారాలు అందించడానికి బాలానగర్ పోలీస్ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, కరెంట్ పోల్స్, మాన్ హెూల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు. పౌరులు అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం బాలానగర్ పిఎస్ నంబర్: 8712663209 కు కాల్ చేయవచ్చని, వెంటనే పోలీస్ యంత్రాంగం స్పందించి సహాయం అందిస్తుందని సీఐ నర్సింహా రాజు అన్నారు. అంతేకాక సెక్టార్ ఎస్ఐ వినోద్ - 8712554136, సెక్టార్ 2 హాజీ మియా - 8712663384, సెక్టార్ 34 సరితా పటేల్ రెడ్డి - 8712663201, హైడ్రా కంట్రోల్ రూమ్ 040-29555500, 8712663209, 9000113667 ఐసీసీసీ కంట్రోల్ రూమ్ 8712674000 నెంబర్ లకు అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం సంప్రదించవచ్చని, బాలానగర్ పిఎస్ నందు ఏర్పాటు చేసిన నెంబర్ 24 గంటలు పనిచేస్తుందని, ఈ నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ నర్సింహా రాజు మరోసారి విజ్ఞప్తి చేశారు.

## మాకు న్యాయం చేయాలి ఎస్సీ ఎస్టీ కమిషన్ను కలిసిన లక్కాయిపల్లి దళితులు



**మద్దూర్ జులై 26 ప్రభాతవార్త** నారాయణపేట జిల్లా మద్దూరు మండల పరిధిలోని లక్కాయిపల్లి గ్రామానికి చెందిన దళితులు మా సొంత భూమి అయినా 105 సర్వే నెంబర్1-24 విస్తీర్ణం భూమిని మా తాతల కాలం నుంచి మేము సాగు చేస్తున్నాం గ్రామానికి చెందిన కొందరు బీసీలు మా భూమిని ఆక్రమించడానికి ప్రయత్నం చేసి మాపై కులం పేరుతో దాడులు చేశారు గత నెల 18వ తేదీ రోజు మద్దూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా జూలై రెండవ తేదీ రోజు పోలీస్ స్టేషన్లో పోలీసులుఎంపైర్ నమోదు చేశారు .అనంతరం డిఎస్పి విచారణకు వచ్చి వెళ్లిపోయారు. అనంతరం వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఎస్సీ ఎస్టీ కమిషన్ కలవడం జరిగిందని బి వెంకటయ్య తెలిపారు. మాకు వారి నుంచి ఎప్పుడైనా ఏ ఆపద అయిన రావచ్చని వారు అంటున్నారు. కలిసిన వారిలో సాయిలు, బాబు, ఎల్లప్ప, రాములు, బుగ్గప్ప, రమేష్, అంజయ్య ఉన్నారు.

## పోలీస్ స్టేషన్ను సందర్శించిన రాచకొండ సీపీ సుధీర్ బాబు



**సంస్థాన్ నారాయణపురం, జూలై 26( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లాలోని సంస్థాన్ నారాయణపురం మండల పోలీస్ స్టేషన్ను రాచకొండ సిపి సుధీర్ బాబు ఆకస్మికంగా సందర్శించారు. సీపీ సుధీర్ బాబు పోలీస్ స్టేషన్లో అందుబాటులో ఉన్న మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు.పోలీస్ స్టేషన్లో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను, మౌలిక వసతుల్లో ఏమైనా లోపాలు ఉన్నాయా అనే విషయాలను స్థానిక ఎస్సై జగన్ను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని ఎస్సైని కోరారు. వారి సమస్యలను పరిష్కరించడానికి తన వంతుగా కృషి చేస్తానని, అవసరమైన చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా సీపీ సుధీర్ బాబు హామీ ఇచ్చారు.

## రాజపేట తండాలో ఘనంగా మొహరం వేడుకలు.




**మర్రిగూడ(ప్రభాత సూర్య):-**మండలంలోని రాజపేట తండా పంచాయతీ నందు మొహరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కుల మతాల భేధాలు లేకుండా, గ్రామంలో మొహరం వేడుకలను జరుపుకున్నారు. గ్రామంలో పీరీలతో తిరుగుతూ, భక్తులను అశీర్వదిస్తూ సూచనలు చెప్పారు ముస్లిం సోదరులు. హిందూ ముస్లిం బాయ్ బాయ్ అనే విధానంతో అలావ్ చుట్టూ గంతులేస్తూ ఘనంగా పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ అక్బర్, జహంగీర్, తొంటజానీ, బషీర్, జిలాని, ఖాజా, జాఫర్, జమాల్పురి రవి, సిరికొండ బిక్షం, బూరెల రఘు, గాధగోని జంగిలి, గౌని శ్రీకాంత్, రహీమ్, ఇంతియాజ్, సల్మాన్, అబ్బాస్, సద్దాం, హైమద్, జానీ, అనిల్, రాజశేఖర్, షఫీ, హాకిమ్ బాయ్, అజ్మత్, నజీర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

## దారి మళ్లుతున్న ఇందిరమ్మ ఇసుక

**కరీంనగర్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక తరలించే వేసులుబాటు కల్పించింది. ఈ నిబంధనలను ఆసరాగా చేసుకొని కొంతమంది జేబులు నింపుకుంటున్నారు. వేములపల్లి మండలం రావులపెంట గ్రామంలోని మూసి వాగు నుండి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా ఇందిరమ్మ ఇళ్ల పేరిట పరిమిషన్ తీసుకొని వేరొక చోట అమ్ముకొని దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమంగా తరలించి మార్కెట్లో విక్రయించి సొమ్ము కూడాబెట్టుకుంటున్నారు. ఇదంతా తెలిసినప్పటికీ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొరకు పంచాయతీ కార్యదర్శి ఇల్లు మంజూరైనట్లు తహసిల్దార్ కు తెలియజేస్తారు. దీంతో తహసిల్దార్ ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వ్యక్తికి ఇసుక కొరకు అనుమతులు ఇస్తారు. అనుమతి తీసుకున్న వారికి మాత్రమే ఇసుకను తరలించాలని నిబంధనలు ఉంటాయి.కానీ అనుమతి ఒకచోట అన్లోడింగ్ మరొకచోట చేస్తూ దళారులు ధనార్జనే ధ్యేయంగా ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు.

# వినయవిధేయ రేవంత్



హైదరాబాద్ : బాస్ ఈస్ ఆల్వేస్ కరెక్ట్” అనే విధానం ఎవరు అవలంభిస్తారో వారికి ఏ రంగంలోనూ ఎదురుండదు అనేది నిత్య సత్యం. ముఖ్యంగా ఎదిగే నాయకులకు ఉండాల్సిన ప్రధాన లక్షణం అధినేతకు విధేయులుగా ఉండడం. అప్పుడే ఆ రంగంలో మనుగడ సాధ్యమవుతుంది. అయితే అధినేత పట్ల విధేయత చాటుకునేందుకు సమయం సందర్భం ఉండాలి. ఆ సమయం వచ్చినప్పుడు ఏ స్థాయిలో మీ విధేయత చాటుతారో ఆ స్థాయిలో మీకు అంతర్గతంగా, బహిరంగంగా మద్దతు ఉంటుందనే రహస్యం తెలిసిన నాయకుడు రేవంత్ రెడ్డి. అధినేతకు విధేయత గా ఉండడం రేవంత్ రెడ్డికి అనుభవపూర్వకంగా వచ్చిన ఉన్నతమైన లక్షణం. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, ఊహాగానాలకు ఒకే స్టెప్పుతో చెక్ పెట్టేశాడు. అధిష్టానం రేవంత్ విషయంలో అసంతృప్తితో ఉన్నారు, ముఖ్యమంత్రిని మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి, ఆయన ఢిల్లీ వెళితే వారి అధినాయకత్వం అపాయింట్మెంట్ ఇవ్వడం లేదు అని మీడియాలో వ్యతిరేక పార్టీ నాయకుల వ్యాఖ్యలను తిప్పికొట్టారు. అన్నిటికీ ఏకైక పరిష్కారం హైకమాండ్. వారితో ఏవిధంగా వ్యవహరించాలో ముఖ్యమంత్రికి తెలిసినంతగా రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులకు కూడా తెలియదని ఢిల్లీలో జరిగిన కుల గణన పై ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించిన సమావేశంలో ఆయన వ్యవహరించిన తీరును చూస్తే అర్థమవుతుంది. ముఖ్యమంత్రిగా హుందాను ఒకవైపు ప్రదర్శిస్తూనే, మరోవైపు అధినాయకత్వంపై తనకున్న అభిమానాన్ని ఎలాంటి భేషజాలు లేకుండా వేదికపైన ప్రదర్శించడం కనిపించింది. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తనను మెచ్చుకుంటూ రాసిన లేఖను చూపిస్తూ ఆ లేఖ తనకు ఒక నోబెల్ బహుమతిగా, ఒక ఆస్కార్ అవార్డుగా భావిస్తున్నట్లు ప్రకటించారు. ఆ మాటలకు వేదిక కింద ఉన్న రాహుల్, ప్రియాంకలను ఇంప్రెస్ చేశాయనడంలో సందేహం లేదు. వారు ఆయన మాటలకు స్పందిస్తూ చిరునవ్వులు చిందిస్తూ, కారచాలనం చేసి మరీ అభినందించడం చూశాం. నాయకుడిగా ఎదగాలంటే చేయాలంటే, అధినాయకుడి ఎపుడూ కార్యకర్తగా మెలగాలి. లేకుంటే రాజకీయ భవిష్యత్తు అగమ్య గోచరమౌతుందని అందరు తీసుకోవాల్సిన సత్యం. అలాగే అధినాయకత్వానికి తాను అత్యంత సన్నిహితుడనని, ఎన్ని పిల్లిమొగ్గలు వేసినా, నష్టపోయేది మీరేనని కూడా ఎగిరెగిరి పడుతున్న సీనియర్ నాయకులకు ఈ విధంగా ఒక సందేశం ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఏది ఏమైనా రేవంత్ రెడ్డిని ఇబ్బంది పెట్టేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా హైకమాండ్ ఆశీస్సులు ఉన్నంతవరకు ఏది జరగదు అనే విషయం తేటతెల్లమైంది.

# తెలంగాణకు భారీగా పెట్టుబడులు



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ముఖ్య లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఈ కలను నిజం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి దూరదృష్టి, పట్టుదలతో సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. హైదరాబాద్ హిటెక్స్ సెంటర్‌లో ప్రారంభమైన ఇన్వెస్టోపియా గ్లోబల్ సమిట్‌లో రాష్ట్ర ఐటీ ఇండస్ట్రీస్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధి దిశగా జరుగుతున్న పరిణామాలను వివరించారు. యూఏఈ పారిశ్రామికవేత్తలు తెలంగాణతో భాగస్వామ్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శ్రీధర్ బాబు మాట్లాడుతూ, “తెలంగాణ భౌగోళికంగా చిన్నదైనా, లక్ష్యాలు మాత్రం గొప్పవే. తక్కువ కాలంలోనే ఫీనిక్స్ పక్షిలా అభివృద్ధి సాధించింది. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ ఇప్పుడు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారిందని తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర వృద్ధి 8.2%గా నమోదైంది. ఇది దేశ సగటు వృద్ధి రేటు 7.6% కంటే ఎక్కువ. రాష్ట్రం జాతీయలో 5% కంటే ఎక్కువ వాటా అందిస్తోంది. ఈ గణాంకాలు తెలంగాణ వేగవంతమైన అభివృద్ధి దిశగా వెళ్తోందని స్పష్టంగా చూపిస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పరిశ్రమల విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. డ్రై పోర్టులు, మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు, ఇండస్ట్రియల్ కారిడార్లు, జోన్లు, నెట్-జీరో పార్కులు, గ్రీన్ లాజిస్టిక్స్ హబ్‌లు, ప్రాంతీయ రింగ్ రోడ్ మరియు మెట్రో రైలు ఫేజ్-2 ప్రాజెక్టులు పరిశ్రమలకు మరింత ఊపు ఇస్తున్నాయని శ్రీధర్ బాబు వివరించారు. ఈ ప్రాజెక్టులు అమలు అయితే తెలంగాణ పెట్టుబడిదారులకు ప్రధాన కేంద్రంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణను భవిష్యత్తులో గ్లోబల్ టెక్ హబ్‌గా మార్చడానికి ‘ఫ్యూచర్ సిటీ’ ప్రాజెక్ట్ కీలకం కానుంది. ఫిన్‌టెక్, క్లైమేట్ టెక్, స్మార్ట్ మొబిలిటీ ఇన్నోవేషన్స్ కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి జరుగుతోంది. ఎఐ ల్యాబ్స్, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, డేటా సెంటర్లు, ఏరోస్పేస్ క్లస్టర్లు.. ఇవన్నీ రాష్ట్రాన్ని టెక్నాలజీ కేంద్రంగా నిలుపుతున్నాయి. గత 18 నెలల్లోనే తెలంగాణలో రూ. 3.2 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం రాష్ట్ర పరిశ్రమల శక్తిని సూచిస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో యూఏఈకి తెలంగాణ ఎగుమతులు 2.5 రెట్లు పెరిగాయి. ఫార్మా, ఏరోస్పేస్, డిజిటల్ సర్వీసులు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలు ఈ వృద్ధిలో కీలకపాత్ర పోషించాయి. లూలూ గ్రూప్, డీపీ వరల్డ్, నాఫ్కో వంటి ప్రముఖ యూఏఈ కంపెనీలు ఇప్పటికే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం రేవంత్ రెడ్డి విజన్‌ను మరింత బలపరుస్తోంది. ఈ ఇన్వెస్టోపియా సమ్మిట్ అనేది పాత స్నేహితుల పునర్మిళకలాంటిది. యూఏఈలా తెలంగాణ కూడా సమయాన్ని, నమ్మకాన్ని, మార్పును విలువైనవిగా భావిస్తుందని శ్రీధర్ బాబు అన్నారు. ఈ సమ్మిట్‌లో యూఏఈ ఎకానమీ టూరిజం మంత్రి అబ్దుల్లా బిన్ తూక్ అల్ మార్రీ, తెలంగాణ ఇండస్ట్రీస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, శశాంక్, యూఏఈ మినిస్ట్రీ ఆఫ్ ఇన్వెస్ట్మెంట్ అండర్ సెక్రటరీ మొహమ్మద్ అల్ వాహైబి, యూఏఈ ఇంటర్నేషనల్ ఇన్వెస్టర్స్ కౌన్సిల్ సెక్రటరీ జనరల్ వాలీద్ హారెబ్ అల్ ఫలాహి, ఇన్వెస్టోపియా అఖా జీన్ ఫారెస్ పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో తెలంగాణ అభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోంది. ప్రతి పౌరుడు గర్వపడే విధంగా రాష్ట్రం ఎదుగుతూ ఉండటం ఆనందకర విషయం. రాబోయే సంవత్సరాల్లో పెట్టుబడులు, ఎగుమతులు, సాంకేతికత, మౌలిక సదుపాయాల కలయికతో తెలంగాణను ఒక బ్రాండ్‌గా మార్చాలనే లక్ష్యం ప్రభుత్వానికి ఉందని మంత్రి స్పష్టంగా చెబుతున్నారు

# ఫ్యూచర్ శంషాబాద్




హైదరాబాద్ : దేశవ్యాప్తంగా విమానాశ్రయాల సమీప ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ బూమ్ కొనసాగుతోంది. ముఖ్యంగా హైదరాబాద్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని చుట్టుముట్టిన గ్రామాలు, పట్టణాల్లో భూముల ధరలు ఆశ్చర్యకరమైన రీతిలో పెరిగినట్లు తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. కరోనా తర్వాతి కాలంలో ? అంటే 2021 నుంచి 2025 మధ్య ? ఈ పెరుగుదల మరింత వేగంగా నమోదైందని నివేదికలు చెబుతున్నాయి. విమానాశ్రయానికి 50 కిలోమీటర్ల పరిధిలో డిమాండ్ కొనసాగుతోందని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. విమానాశ్రయం అభివృద్ధికి ముందు, శంషాబాద్ పరిధిలో భూముల రేట్లు చాలా తక్కువగా ఉండేవి. 1990ల చివరలో చదరపు గజం ధర రూ.500లోపే ఉండేదని అప్పటి రియల్ ఎస్టేట్ డీలర్లు చెబుతున్నారు. కానీ ఇప్పుడీ ప్రాంతం పూర్తిగా మారు రూపం దాల్చింది. శంషాబాద్, బుద్వేల్, సాతంరాయి, మామిడిపల్లి, తుక్కుగూడ వంటి ప్రాంతాల్లో గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లు, విల్లా ప్రాజెక్టులు భారీగా నిర్మాణంలో ఉన్నాయి. ఇవన్నీ విమానాశ్రయానికి 25-50 కిలోమీటర్ల పరిధిలో ఉన్నాయిరియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ స్క్వేర్యార్డ్స్ ప్రకారం, గత ఐదేళ్లలో విమానాశ్రయం సమీప భూగర్భాలు సగటున 74 శాతం ధరల పెరుగుదలను చవిచూశాయి. అపార్ట్‌మెంట్ల ధరలు చదరపు అడుగుకు రూ.6,000 నుంచి రూ.8,000 మధ్యగా ఉండగా, ఇతర ప్రముఖ ప్రాంతాల్లో అదే చదరపు అడుగు ధర రూ.9,000 నుంచి రూ.11,000 వరకు ఉంది. స్థలాల విషయంలో చూస్తే, విమానాశ్రయం సమీపంలో చదరపు గజం ధరలు రూ.55,000 నుంచి రూ.60,000 మధ్య ఉన్నాయి. అదే సమయంలో ఇతర నగర ప్రాంతాల్లో ఇవే రేట్లు రూ.75,000 నుంచి రూ.80,000 వరకు వెళుతున్నాయి. వాస్తవానికి ఇప్పటివరకు శంషాబాద్ చుట్టుపక్కల అభివృద్ధి ఆశించిన స్థాయికి చేరలేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జీవో 111 పరిమితులు, పరిశ్రమలు లేకపోవడం వంటి కారణాలు ప్రధానమైనవని వారు చెబుతున్నారు. అయినప్పటికీ, గత నాలుగైదేళ్లుగా దక్షిణ హైదరాబాద్ వైపు అభివృద్ధి బాగా ఊపందుకుంది. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో ఎకరం స్థలానికి రూ.4 కోట్లు పలుకుతుండగా, ఇంకా కొన్ని ప్రాంతాల్లో చదరపు గజం రూ.5,000 నుంచి రూ.10,000 మధ్యలో దొరికే అవకాశముంది. విల్లాల ధరలు రూ.కోటికి పైగానే ఉంటున్నాయి. ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ముఖ్యంగా శంషాబాద్, తుక్కుగూడ, మహేశ్వరం ప్రాంతాల్లో మౌలిక వసతుల విస్తరణకు ప్రణాళికలు రూపొందించబడుతున్నాయి. నాగోల్ నుంచి ఆరంఘర్ మీదుగా విమానాశ్రయం వరకు మెట్రో రైలు విస్తరణ (లైన్ 2ఏ) ప్రతిపాదించబడింది. రాజేంద్రనగర్‌లో కొత్త హైకోర్టు భవనం నిర్మాణం జరుగుతోంది. శ్రీశైలం-నాగార్జునసాగర్ రహదారుల మధ్యలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరగనుంది, ఇది విమానాశ్రయానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడి నుంచి ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో విస్తరణ యోచనలో ఉంది. మహేశ్వరం పారిశ్రామిక హబ్‌గా మారుతోంది. ఇటీవల ఓ జ్యువెలరీ తయారీ యూనిట్‌కు సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం కూడా జరిగింది. పలు బడా నిర్మాణ సంస్థలు రిటైర్మెంట్ హోమ్స్, టౌన్‌షిప్‌లు నిర్మించేందుకు భూముల సేకరణ చేపట్టాయి. ఇప్పటికే పలు విద్యాసంస్థలు, ఆధ్యాత్మిక కేంద్రాలు ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతున్నాయి. ప్రాంతీయ వలయ రహదారి పూర్తయ్యే దశలో ఉండటంతో, శంషాబాద్ పరిధి రాబోయే కాలంలో భారీగా అభివృద్ధి చెందే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## చౌటుప్పల్ లో రోడ్డు ప్రమాదం
## ఇద్దరు డీఎస్పీల దుర్మరణం

నల్గొండ : చౌటుప్పల్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన ఇంటెలిజెన్స్ డీఎస్పీ చక్రధర్ రావు, మరో డీఎస్పీ శాంతా రావు దుర్మరణం పాలయ్యారు. తీవ్రంగా గాయపడ్డ మరో అధికారి ప్రసాద్ ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అయన పరిస్థితి విషమంగా వుంది. మృతులు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి డివైడర్ ను డీ కొట్టి అవతల వైపు వైపుకు దూసుకువచ్చింది. ఎదురుగా వచ్చిన లారీ కారును కొట్టింది. ఘటనలో ఇద్దరు డీఎస్పీలు . స్పాట్ లో ప్రాణాలు విడిచారు. ఇద్దరు డీఎస్పీల మృతిపై హోంమంత్రి అనితగ్భ్రాంతి వ్యక్తం చేసారు. విధినిర్వహణలోని పోలీసులు మరణించడం బాధాకరమని అన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని అన్నారు.

## ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు
## పాడి కౌశిక్ రెడ్డి నివాసం వద్ద ఉద్రిక్తత?

**బీఆర్ఎస్ శ్రేణుల మోహరింపు....**

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు రాష్ట్రంలో రాజకీయ వేడిని రాజేశాయి. ఈ వ్యాఖ్యల పట్ల తీవ్ర ఆగ్రహంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు ఎన్ఎస్యూఐ (ఔజఐ) కార్యకర్తలు పాడి కౌశిక్ రెడ్డిపై దాడి చేసే అవకాశం ఉందనే సమాచారంతో కొండాపూర్లోని ఆయన నివాసం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిస్థితిని పసిగట్టిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాడి కౌశిక్ రెడ్డి ఇంటికి చేరుకుంటున్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేకు మద్దతుగా, కాంగ్రెస్ శ్రేణుల దాడిని అడ్డుకునేందుకు వారు మోహరించారు. కౌశిక్ రెడ్డి నివాసం పరిసరాల్లో పోలీసులు అదనపు బలగాలను మోహరించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

## నాటు తుపాకుల కలకలం ..
## స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఖమ్మం : ఖమ్మం జిల్లా కల్లూరు మండలం తాళ్లూరి వెంకటాపురం గ్రామం లో పోలీసులు అనుమతులు లేని నాటు తుపాకులను స్వాధీనం చేసుకోవడం కలకలం రేపింది. తాళ్లూరి వెంకటపురం గ్రామంలో చెరువు వద్ద కాపలాదారులైన ఘంటసాల లక్ష్మీనారాయణ, పెద్దిరాజు అనే ఇద్దరు వ్యక్తులు నాటు తుపాకులు కలిగి ఉన్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు దాడులు జరిపారు. నిందితులనుంచి అనుమతులు లేని రెండు నాటు తుపాకులు, గన్ పౌడర్ ను స్వాధీనం చేసుకున్నారు. లైసెన్స్ లేకుండా నాటు తుపాకీ కలిగి ఉండడంతో ఇద్దరి వ్యక్తుల పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కల్లూరు పోలీసులు తెలిపారు.

## డిజిటల్ డిటాక్స్...
## వన్ మంత్ బ్రేక్!

హైదరాబాద్ : 'జబర్దస్త్' పేరు చెబితే తెలుగు ప్రేక్షకులకు ముందుగా గుర్తుకు వచ్చే సెలబ్రిటీలలో రష్మీ గౌతమ్ ఒకరు. ఆ షో యాంకరింగ్ చేయడం ద్వారా ఆవిడ చాలా పాపులర్ అయ్యారు. తన అభిప్రాయాలను సోషల్ మీడియాలో చాలా స్ఫూర్తిగా, నిర్మొహమాటంగా వెల్లడించే రష్మీ గౌతమ్, నెల రోజుల పాటు ఆ సోషల్ మీడియాకు బ్రేక్ ఇవ్వాలని డిసైడ్ అయ్యారు.'హలో... నెల రోజులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని (డిజిటల్ డిటాక్స్) నిర్ణయించుకున్నాను. వ్యక్తిగత జీవితంతో పాటు వృత్తిపరమైన అంశాలలోనూ కాస్త ‘లో’లో ఉన్నాను (అనుకోనివి జరగడం వల్ల బాధ పడటం కావచ్చు). ఈ టైంలో నేను తీసుకునే నిర్ణయాలను సోషల్ మీడియా ప్రభావితం చేసే అవకాశం ఉంది. అందుకని, బ్రేక్ తీసుకుంటున్నాను. అయితే ఒక్కటి మాత్రం ప్రామిస్ చేయగలను. మరింత శక్తివంతంగా మీ ముందుకు వస్తాను. నేను మునుపటిలా హుషారుగా ఉండటానికి నా ఎనర్జీని మళ్ళీ పొందాలి. నా మీద ఎవరి ప్రభావం ఉండకూడదు. నేను ఎప్పుడూ స్ట్రాంగ్‌గా ఉంటాను. అయితే కొన్ని విషయాలను సరి చేయాల్సిన సమయం వచ్చింది. నేను సోషల్ మీడియాకు కాస్త విరామం ఇస్తున్నా మీ ప్రేమ, అభిమానం ఎప్పుడూ ఇలాగే ఉంటాయని ఆశిస్తున్నాను” అని రష్మీ గౌతమ్ పేర్కొన్నారు. సోషల్ మీడియా నుంచి బ్రేక్ తీసుకోవడానికి గల కారణం ఏమిటో రష్మీ గౌతమ్ చెప్పారు. అయితే అది పూర్తిగా చెప్పలేదు. వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాల్లో లో ఫేజ్ నడుస్తుందని చెప్పారు. అది ఏమిటనేది చెప్పలేదు. దాంతో రష్మీకి ఏమైంది? ఉన్నట్టుండి ఎందుకీ నిర్ణయం తీసుకుంది? అని ఫ్యాన్స్ ఆలోచిస్తున్నారు. ఆవిడ బ్రేక్ ఇచ్చింది సోషల్ మీడియాకు మాత్రమే. టీవీ షోలకు కాదు. ప్రతి వారం ‘జబర్దస్త్’లో రష్మీ గౌతమ్ సందడి కంటిన్యూ అవుతుంది. అయితే ఆ ఎపిసోడ్ డ్రస్ తో దిగిన ఫోటోలను ఆవిడ సోషల్ మీడియాలో షేర్ చేయరు, అది అసలు విషయం. సోషల్ మీడియాలో చేసే కామెంట్లు ఆవిడ దృష్టి వరకు వెళ్లవు. సో కాల్డ్ సోషల్ మీడియా నెగెటివిటీకి రష్మీ గౌతమ్ దూరంగా ఉండాలని డిసైడ్ అయ్యారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆవిడ మూగ జీవాల గురించి ఎన్నోసార్లు పోస్టులు చేశారు. వాటి మీద కూడా వ్యతిరేకత వ్యక్తం అయిన సందర్భాలు ఉన్నాయి. అన్నిటిని తట్టుకుని రష్మీ గౌతమ్ బలంగా నిలబడ్డారు. ఇప్పుడు ఎందుకు బ్రేక్ ఇస్తున్నారో మరి? వెయిట్ అండ్ సి. వన్ మంత్ బ్రేక్ తర్వాత చెబుతారు ఏమో!?

## ప్రొఫెసర్ ఎంత పనిచేశాడో...

హైదరాబాద్ : హైదరాబాద్ జేఎన్‌టీయూలో ఓ ప్రొఫెసర్ చేసిన పొరపాటుతో 138 మంది విద్యార్థులు తమ చివరి సెమిస్టర్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ సబ్జెక్టు జవాబు పత్రాలను తప్పు ప్రశ్నపత్రంతో దిద్దడమే దీనికి కారణం. ఓ విద్యార్థి ఫిర్యాదుతో తప్పును గుర్తించిన అధికారులు, సరిచేసిన ఫలితాలను ప్రకటించారు. దీంతో ఫెయిల్ అయిన విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యారు, అయితే ప్రొఫెసర్ నిర్లక్ష్యంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ జేఎన్‌టీయూలో ఓ ప్రొఫెసర్ చేసిన చిన్న తప్పు కారణంగా మూడు కాలేజీలకు చెందిన 138 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. పరీక్షా ఫలితాలు ఆలస్యంగా వెలువడటం, అందులోనూ తమ పిల్లలు కీలకమైన సబ్జెక్టులో ఫెయిల్ కావటం తెలిసి తల్లిదండ్రులు, విద్యార్థులు తీవ్ర ఆందోళన, ఆవేదన వ్యక్తం చేశారు. ఓ విద్యార్థి చేసిన ఫిర్యాదుతో పొరపాటును అధికారులు గుర్తించిన అధికారులు ఫలితాలను సరిచేసి తిరిగి ప్రకటించారు. వివరాల్లోకి వెళితే.. గత నెలలో జరిగిన జేఎన్‌టీయూ బీటెక్ నాలుగో ఏడాది రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను ఈ నెల 17న విడుదల చేశారు. ఈ ఫలితాల్లో చివరి ఏడాదిలో ఉండే క్రెడిట్ బేస్డ్ సబ్జెక్ట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ లో శ్రీదత్త, మల్లారెడ్డి, షాదన్ కాలేజీలకు చెందిన 138 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఇంజినీరింగ్ చివరి సంవత్సరంలో ఉన్న విద్యార్థులు కీలకమైన సబ్జెక్టులో ఫెయిల్ అవ్వడం వారిని తీవ్ర మనోవేదనకు గురిచేసింది. దీనివల్ల తమ భవిష్యత్తు, ఉన్నత విద్య అవకాశాలు దెబ్బతింటాయని ఆవేదన చెందారు. శ్రీదత్త కాలేజీకి చెందిన ఒక విద్యార్థికి ఈ ఫలితాలపై అనుమానం వచ్చి జేఎన్‌టీయూ పరీక్షల విభాగానికి మెయిల్ చేశాడు. ఇఎం సబ్జెక్టులో ఇంతమంది ఫెయిల్ అవ్వడానికి అవకాశం లేదని, మరోసారి ఫలితాలను చెక్ చేయాలని కోరాడు. దీంతో అప్రమత్తమైన అధికారులు ఫలితాలను తనిఖీ చేయగా.. నిజంగానే 138 మంది విద్యార్థులు ఫెయిల్ అయినట్లు గుర్తించారు. ఆ తర్వాత వారి జవాబు పత్రాలను పరిశీలించగా.. వాటిని దిద్దిన ప్రొఫెసర్ ఘోరమైన పొరపాటు చేసినట్లు తేలింది. పరీక్ష ఉదయం, సాయంత్రం రెండు సెషన్లలో వేర్వేరు ప్రశ్నపత్రాలతో ఎగ్జామ్ నిర్వహించారు. అయితే ఆ ప్రొఫెసర్ ఉదయం ప్రశ్నపత్రంతోనే సాయంత్రం సెషన్ జవాబు పత్రాలను కూడా దిద్దినట్లు గుర్తించారు. ఈ తప్పిదాన్ని గుర్తించిన వెంటనే.. అధికారులు సాయంత్రం ప్రశ్నాపత్రంతో జవాబు పత్రాలను మళ్ళీ దిద్దించారు. ఫలితంగా, ఫెయిల్ అయిన విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యారు. గురువారం రాత్రి సరిచేసిన ఫలితాలను తిరిగి ప్రకటించారు. ఈ వార్త తెలియగానే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ఒక ప్రొఫెసర్ నిర్లక్ష్యం కారణంగా ఇంతమంది విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురికావడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన జేఎన్‌టీయూ పరీక్షల పర్యవేక్షణలో లోపాలను ఎత్తి చూపిందని అంటున్నారు.

# సినీ నిర్మాత, హీరోను చెప్పుతో కొట్టిన నటి




బాలీవుడ్ నటుడు, నిర్మాత మాన్ సింగ్‌ను నటి రుచి గుజ్జర్ చెప్పుతో కొట్టింది. 'సో లాంగ్ వ్యాలీ' అనే హిందీ చిత్రాన్ని మాన్ సింగ్ దర్శత్వం వహించడంతో పాటు ఆయనే నిర్మాతగా ఉన్నారు. ఆపై ఇదే చిత్రంలో కీలక పాత్రలో నటించారు. జులై 25న చిత్ర యూనిట్‌తో కలిసి ముంబైలోని సినీపోలిస్ థియేటర్‌కు మాన్ సింగ్ వచ్చారు. ఆ సమయంలో నటి రుచి గుజ్జర్ ఆవేశంతో తనకు చెల్లించాల్సిన డబ్బు ఇవ్వాలంటూ చెప్పుతో కొట్టింది. అందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుంది. నిర్మాత, నటుడు మాన్ సింగ్ తనకు రూ. 25 లక్షలు బాకీ ఉన్నాడని రుచి గుజ్జర్ పేర్కొంది. ఆ డబ్బు ఇవ్వాలంటూ అతనిపై చెప్పుతో దాడి చేసింది. ఈ క్రమంలో చెప్పు దాడి నుంచి తప్పించుకునేందుకు ఆయన ప్రయత్నం చేయగా.. ఆమెను నిలువరించేందుకు చిత్ర సహ నిర్మాత కరణ్ అడ్డుపడ్డాడు. ఆ చిత్ర నిర్మాతలు గాడిదలపై కూర్చున్నట్లు చిత్రీకరించబడిని కొన్ని ప్లకార్డులను ఆమె ప్రదర్శించింది. అందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుంది. చాలా కాలంగా తనకు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వకుండా తనను ఇబ్బంది పెడుతున్నాడని మాన్ సింగ్‌పై పోలీసులకు రుచి గుజ్జర్ ఫిర్యాదు చేసింది. మ్యూజిక్ ఆల్బమ్‌లకు సంబంధించి తనకు రావాల్సిన రెమ్యునరేషన్ కోసం ఆమె ఇలా చేయాల్సి వచ్చినట్లు తెలుస్తోంది. నటి రుచి గుజ్జర్ ప్రధానంగా మోడలింగ్, మ్యూజిక్ వీడియోల ద్వారా బాలీవుడ్‌లో గుర్తింపు పొందింది. కొన్ని ప్రైవేట్ వీడియో సాంగ్స్‌లో నటించిన ఆమెకు పాపులారిటీ వచ్చింది. 2023 మిస్ హర్యానాగా నిలిచిన ఈ బ్యూటీ ఈ ఏడాది మే నెలలో జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో సందడి చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోతో కూడిన నెక్లెస్ ధరించి అందరినీ ఆకర్షించే ప్రయత్నం చేసింది.





## 'ఖైదీ 2' తర్వాత రజినీ సర్‌తో మరో సినిమా చేస్తాను : లోకేష్ కనగరాజ్

తమిళ స్టార్ దర్శకుడు లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం కూలీ. రజినీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో అగ్ర నటులైన నాగార్జున, ఆమిర్ ఖాన్, సత్యరాజ్, ఉపేంద్ర, షౌబిన్ షబీర్, శృతి హాసన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం ఆగష్టు 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా వరుసగా ప్రమోషన్స్ చేస్తుంది చిత్రయూనిట్. అయితే ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో పాల్గోన్న లోకేష్ తన అప్‌కమింగ్ ప్రాజెక్ట్‌ల గురించి స్పందించాడు. 'కూలీ' చిత్రాన్ని చూసిన తర్వాత రజనీకాంత్ సార్ తనతో కలిసి మరో సినిమా చేయాలని కోరారని లోకేష్ కనగరాజ్ తెలిపారు. అయితే, ఈ కొత్త ప్రాజెక్ట్ 'కూలీ 2' కాదని లోకేష్ స్పష్టం చేశారు. "కూలీ సినిమాకు సరైన ప్రారంభం మరియు ముగింపు ఉన్నాయి కాబట్టి, అది 'కూలీ 2' అయ్యే అవకాశం లేదు" అని ఆయన పేర్కొన్నారు. దీనిబట్టి, రజనీకాంత్, లోకేష్ కాంబినేషన్‌లో రాబోయే తదుపరి చిత్రం పూర్తిగా కొత్త కథాంశంతో ఉంటుందని తెలుస్తోంది. అయితే ఈ ప్రాజెక్ట్ ఖైదీ 2 తర్వాత ఉంటుందని లోకేష్ వెల్లడించాడు.



## రిలీజ్‌కి ముందే రికార్డులు క్రియేట్ చేస్తున్న కింగ్‌డమ్.. 24 గంటలు కాకముందే

రౌడీ హీరో విజయ్ దేవరకొండని వరుస ఫ్లాపులు పలకరిస్తున్నా కూడా ఆయన క్రేజ్ తగ్గడం లేదు. విజయ్ దేవరకొండ సినిమా రిలీజ్ అవుతుంది అంటే ఫ్యాన్స్ ఆ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తూ ఉంటారు. తాజాగా విజయ్ హీరోగా 'కింగ్‌డమ్' అనే చిత్రం రూపొందింది.. ఈ సినిమాకు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మించాడే. ఈ చిత్రం జూలై 31న ప్రపంచవ్యాప్తంగా తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లో విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా మూవీ ప్రమోషన్ కార్యక్రమాలని వేగవంతం చేసింది. ఇప్పటికే కింగ్‌డమ్ బాయ్స్ అంటూ దర్శకుడు గౌతమ్ తిన్ననూరితో పాటు విజయ్ దేవరకొండ, సందీప్ రెడ్డి వంగా కలిసి ఒక పాడ్ కాస్ట్‌ని విడుదల చేయగా, అది అందరిని అలరించింది. మరోవైపు నేడు తిరుపతిలో ట్రైలర్ లాంచ్ వేడుక ప్లాన్ చేశారు. ఇక ప్రీ రిలీజ్ వేడుకని హైదరాబాద్‌లో జూలై 28న నిర్వహించబోతున్నట్లు ప్రకటించింది. మేకర్స్ సినిమాపై మంచి హైప్ తెస్తున్నారు. జూలై 30న యుఎస్‌లో ప్రీమియర్ షోలు జరగనుండగా, బుకింగ్స్ ఓపెన్ చేసిన 24 గంటల్లోనే పదివేల టికెట్లు అమ్ముడయ్యాయి. ఈ విషయాన్ని చిత్రబృందమే అధికారికంగా ప్రకటిస్తూ ఓ స్పెషల్ పోస్టర్ కూడా విడుదల చేసింది. కింగ్‌డమ్ క్రేజ్ చూసి ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. హిందీలో 'సామ్రాజ్య' అనే టైటిల్‌తో ఈ చిత్రం విడుదల కానుంది. సెన్సార్ బోర్డు ఈ సినిమాకు %ఖ/ూ% సర్టిఫికెట్ ఇచ్చింది. మూవీ చూసిన బోర్డు సభ్యులు "సినిమా అదిరిపోయిందంటూ" ప్రశంసలు కురిపించారట. విజయ్ దేవరకొండ %-% గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్‌లో వస్తున్న ఈ యాక్షన్ డ్రామా ఈ ఏడాది టాలీవుడ్‌లో మరో బ్లాక్‌బస్టర్‌గా నిలవబోతోందని అభిమానులు నమ్మకంగా ఎదురుచూస్తున్నారు. కాగా, విజయ్ గతంలో 'ఫ్యామిలీ మ్యాన్' తరహా పాత్రలు చేయగా, ఇప్పుడు కొంత గ్యాప్ తీసుకుని, మళ్లీ యాక్షన్ ఫుల్ అవతార్‌లో 'కింగ్‌డమ్' తో స్క్రీన్‌పై సందడి చేయబోతున్నాడు. 'మళ్ళీ రావా', 'జెర్సీ' లాంటి క్లాసిక్స్ రూపొందించిన గౌతమ్ తిన్ననూరి ఈ సినిమాను ఎవరు ఊహించని విధంగా యాక్షన్ ఎంటర్టైనర్ గా తీర్చిదిద్దారు.



## వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్‌గా మారిన మాళవిక

మాళవిక గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మాళవిక మోహనన్ 7 ఆగస్టు 1992న ముంబైలో జన్మించింది. ఆమె తండ్రి యుకె మోహనన్ బాలీవుడ్ చిత్రాలకు ప్రసిద్ధ సినిమాటోగ్రాఫర్. తల్లి వీణా మోహనన్. ఆమె ప్రస్తుతం తన స్వస్థలమైన కేరళ బియ్యూర్‌లో తన కుటుంబంతో నివసిస్తుంది. మాళవిక మోహనన్ హీరోయిన్ గా రాణిస్తుంది. ఈ ముద్దుగుమ్మ 2013 సంవత్సరంలో "బట్టం బోలే" చిత్రంతో మలయాళ చిత్రసీమలోకి అడుగుపెట్టింది. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా తెరకెక్కిన పెట్టా చిత్రంలో నటించి తమిళ అభిమానుల దృష్టిని ఆకర్షించిన నటి మాళవిక మోహనన్. ఆ తర్వాత నటుడు విజయ్ సరసన లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో మాస్టర్ సినిమాలో నటించి అభిమానుల గుండెల్లో స్థానం సంపాదించుకుంది. రీసెంట్ గా దర్శకుడు బి. రంజిత్ దర్శకత్వంలో విక్రమ్ నటించిన "తంగళన్"లో మాళవిక మోహనన్ కీలక పాత్ర పోషించింది. మాళవిక ఈ సినిమాలో డిఫరెంట్ క్యారెక్టర్ చేసి మెప్పించింది. ఇక ఇప్పుడు ప్రభాస్ హీరోగా నటిస్తున్న రాజా సాబ్ సినిమాతో ఈ అమ్మడు టాలీవుడ్ కు పరిచయం కానుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. ఈ సినిమా తర్వాత టాలీవుడ్ లో ఈ బ్యూటీ రాణిస్తుందేమో చూడాలి. ఇక ఈ అమ్మడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. తాజాగా వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ ల మారింది. వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ అవతార్ లో సోషల్ మీడియాలో కొన్ని ఫోటోలను వదిలింది. ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలకు నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.

## మిరాయ్ ఫస్ట్ సింగిల్ వచ్చేసింది.. వైబ్ ఉంది బేబీ




హనుమాన్ లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత తేజ సజ్జ నటిస్తున్న మరో పాన్ ఇండియా చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మంచు మనోజ్ విలన్‌గా నటిస్తున్నాడు. రితికా నాయక్ హీరోయిన్. సెప్టెంబర్ 5న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా 8 భాషల్లో రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ని విడుదల చేశారు మేకర్స్. 'వైబ్ ఉంది బేబీ' అంటూ సాగే ఈ పాటకు కృష్ణకాంత్ లిరిక్స్ అందించగా, అర్మాన్ మాలిక్ ఆలపించారు. తేజ సజ్జా అదిరిపోయే స్టెప్పులేసి ఆకట్టుకున్నాడు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.